www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం

01-08-2024

సంపుటి : 01 । సంచిక : 89 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



V3 NEWS



డా॥ కాచం సత్యనారాయణ

CMD





# అక్కల మాటలు వింటే బస్టాండే దిక్కు

### కేటీఆర్‌ను ఉద్దేశించి అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య

మహిళా సభ్యులను అవమానించారని బీఆర్ఎస్ నిరసన

నాకు ప్రతిపక్ష హోదా రావొద్దనే సబిత పార్టీ ఫిరాయింపు: భట్టి

రేవంత్ రెడ్డి తన మాటలను వెనక్కి తీసుకోవాలి: సబితా ఇంద్రారెడ్డి

**నిండుసభలో మహిళలను అవమానిస్తారా?**

**సీఎం క్షమాపణలు చెప్పాలి: సబిత**


2


**తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు.. వాడీవేడిగా కొనసాగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పరస్పరం బుధవారం మాటల తూటాలు పేలాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణాస్త్రాలను సంధించుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసన సభ్యురాలు సబిత ఇంద్రారెడ్డి మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం చోటు చేసుకుంది. సబితా ఇంద్రారెడ్డి పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో అసెంబ్లీలో హాట్ టాపిక్ అయింది. ఆమె పార్టీ మారడాన్ని తప్పుపట్టారు. గతంలో తమ ప్రభుత్వంలో దశాబ్ద కాలం పాటు సబిత ఇంద్రారెడ్డికి మంత్రి పదవి ఇచ్చి గౌరవించామని భట్టి విక్రమార్క అన్నారు. ఇక భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదనే ఉద్దేశంతోనే ఆమె పార్టీ ఫిరాయించి బీఆర్ఎస్‌లోకి వెళ్లారని అన్నారు.**

**విశ్వంభర, హైదరాబాద్:**

కాంగ్రెస్ పార్టీ తనను సీఎల్పీ లీడర్‌ను చేస్తే తనకు అండగా, మద్దతుగా వెనక ఉండాల్సింది పోయి పదవి కోసం సబిత పార్టీ ఫిరాయించారంటూ భట్టి విక్రమార్క ఆరోపించారు. తనకు ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా చేయడానికే ఆ పని చేశారని మండిపడ్డారు. పార్టీలు మారి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాక ఇప్పుడు ఏదో మిగతా2లో...

## ఒక్కమాటా తప్పు మాట్లాడలేదు

- సబితా ఇంద్రారెడ్డి తన వ్యక్తిగత విషయాలను మాట్లాడినందుకే, మిగతాది నేను పూర్తి చేశా
- సభలో బహిష్కరణలు, సస్పెన్షన్లు, మార్షల్స్ అవసరం రావొద్దని మా ఆలోచన
- అలాంటి అవసరం సందర్భం వస్తే స్పీకర్ నిర్ణయం తీసుకుంటారు
- అవసరాన్ని బట్టి ఎమ్మెల్యేల సభ్యత్వం కూడా రద్దు కావొచ్చు
- మీడియా చిట్ చాట్ లో సీఎం రేవంత్ రెడ్డి


2


## ఇది తెలంగాణ ఆడబిడ్డలందరికీ అవమానం

- ఈ ముఖ్యమంత్రికి వారి ఉసురు తగుల్తుంది
- సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలి: కేటీఆర్




2


## కాంగ్రెస్ దురహంకారం




2


- మహిళా సభ్యులపై వ్యాఖ్యలు గర్హనీయం
- ప్రజలు గమనిస్తున్నారు: మాజీ మంత్రి హరీశ్‌రావు

# తెలంగాణ గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ ప్రమాణం

### ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

హాజరైన సీఎం రేవంత్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు




2


## బాలికపై అత్యాచారం, హత్య కేసులో ముద్దాయికి ఉరి శిక్ష

**తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు సంచ లన తీర్పు వెలువడించింది. బాలికపై అత్యాచారం, హత్య,కేసులో ముద్దాయికి ఉరి శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. 2018లో నార్సింగిలో నాలుగున్నరేళ్ల బాలికపై తాపీ కార్మికుడు దినేష్ అత్యాచారం చేసి, ఆపై హత్య చేశాడు. ఈ కేసులో 2021లోనే రంగారెడ్డి కోర్టు దోషికి మిగతా2లో...

# తిరస్కరించినా మోదీ తీరు మారలే!

### విభజన రాజకీయాలు..విద్వేష వ్యాప్తికే ఆయన మొగ్గు

పాఠాలు నేర్చుకుంటారనుకున్నా ఫలితం లేదు

ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తారు..అతలాకుతలమైన మణిపూర్‌కు వెళ్లరు

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియా విమర్శలు

అతివిశ్వాసం వద్దని పార్టీ నేతలకు సూచన



**విశ్వంభర, ఢిల్లీ:** విభజన రాజకీయాలను ప్రజలు తిరస్కరించినా మోదీ ప్రభుత్వంలో ఎలాంటి మార్పూ రాలేదని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎదురుదెబ్బ తర్వాత మోదీ సర్కార్ పాఠాలు నేర్చుకుంటుందని ఆశించామని, కానీ ఇప్పటికీ ఆయన సమాజాన్ని వర్గాలవారీగా విభజించి భయం, విద్వేష వాతావరణాన్ని వ్యాప్తి చేసే విధానానికే కట్టుబడి ఉన్నారని వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆమె మిగతా2లో...



# కోలుకోని వయనాడ్


### 200 దాటిన మృతుల సంఖ్య

కొనసాగుతున్న సహాయక చర్యలు


2


**వయనాడ్ వరదల్లో అత్యంత దారుణంగా చూరాల్‌మల, ముండక్కై గ్రామాలుదెబ్బతిన్నాయి. ఎగువన కొండల నుంచి రాత్రికి రాత్రి ఒక్కసారిగా వరద పోటెత్తింది. అప్పటికే ఎడతెగని వర్షాలకు బాగా నానిపోయిన కొండచరియలు కూడా విరిగిపడ్డాయి. ఆ రాళ్లు, వరద, బురద అంతా కింద ఉన్న ఊళ్లను ముంచెత్తింది. ప్రస్తుతం చూరల్‌మలైలో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. ఈ గ్రామానికి వందల అడుగుల ఎత్తులో ఉంది ముండక్కై గ్రామం. విలయంతో అక్కడికి చేరే దారులు, వంతెనలు నాశనమైపోయాయి. సహాయక బృందాలు అక్కడికి పూర్తి స్థాయిలోచేరితే తప్ప అక్కడ పరిస్థితిపై క్లారిటీ వచ్చే అవకాశం లేదు. భారీ వర్షాలకు కేరళ అతలాకుతలం అవుతోంది. పాలక్కాడ్‌లో వరద ఉధృతికి ఓ వంతెన దెబ్బతింది. వంతెనలో కొంత భాగం వరద నీటిలో కూలిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.**


మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

# ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ


2


జ్యూడీషియల్ రియాండ్ పొడగించిన హౌస్ అవెన్యూ కోర్టు

సీబీఐ ఈ ఛార్జ్‌షీట్‌పై మరోసారి విచారణ వాయిదా...



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 94 | ₹ 116 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 168 | ₹ 191 |

## కులాల ప్రస్తావనెందుకు?

- రాహుల్ గాంధీని అవమానించేందుకే..
- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విస్మయం
- రాజ్యసభలో భావోద్వేగం




9


## చైనాతో చర్చలు నిర్మాణాత్మకం

- శాంతిస్థాపన, నియంత్రణ రేఖల పట్ల గౌరవం అవసరమని చెప్పాం
- భారత విదేశాంగ శాఖ వెల్లడి


2




## ఇది తెలంగాణ ఆడబిడ్డలందరికీ అవమానం

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా ఎమ్మెల్యేలను అవమానించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మహిళా శాసనసభ్యులపై అకారణంగా ముఖ్యమంత్రి నోరు పారేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని ముఖ్యమంత్రి చాలా నికృష్టంగా మాట్లాడారన్నారు. ఈ అవమానం కేవలం సబితక్కకు, సునీతక్కకు మాత్రమే జరిగింది కాదని... తెలంగాణ ఆడబిడ్డలందరికీ జరిగిన అవమానమన్నారు. మహిళలను నమ్ముకుంటే బతుకు బస్టాండ్ అవుతుందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడడం శోచనీయమన్నారు. ఈ ముఖ్యమంత్రి అన్ఫిట్ ముఖ్యమంత్రి అన్నారు. నోరు జారితే ఎవరైనా వెనక్కి తీసుకుంటారు కానీ ఈ ముఖ్యమంత్రి ఆడబిడ్డలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు తెలంగాణ ఆడబిడ్డల ఉసురు తగులుతుందనానే్రు. తమ ఇద్దరు మహిళా నేతలు కష్టపడి ప్రజల మధ్యలో తిరిగి నేతలైన గొప్ప ఆడబిడ్డలన్నారు. ప్రజల దీవెనలు... కార్యకర్తల ఆశీర్వాదంతో గెలిచి వచ్చారన్నారు.నీ లెక్క పార్టీలు మారి పదవులు తెచ్చుకున్న వాళ్ళు కారని ముఖ్యమంత్రిని ఉద్దేశించి అన్నారు. ఇప్పటికైనా సీఎం సిగ్గు తెచ్చుకొని... బుద్ధి తెచ్చుకొని బేషరతుగా తమ మహిళా సభ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ మొహం పెట్టుకుని వచ్చావని వారిని ఉద్దేశించి ఉపముఖ్యమంత్రి అనడం అన్యాయమన్నారు. ఆడబిడ్డల గురించి అంత ధైర్యంగా మాట్లాడే అధికారం ఎవరు ఇచ్చారని భట్టివిక్రమార్కను నిలదీశారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ తాము ఏ ఒక్కరోజైనా ఆడబిడ్డలను అవమానించామా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో మాట్లాడామంటూ అభ్యంతరం చెబితే, తాము వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. అది తమకు కేసీఆర్ నేర్పిన సంస్కారం అన్నారు. అసెంబ్లీలో ఈరోజు ఆడబిడ్డలకు జరిగిన అవమానం మొత్తం తెలంగాణ ఆడబిడ్డలకు జరిగిన అవమానమే అన్నారు. ముఖ్యమంత్రి సిగ్గు, బుద్ధి జ్ఞానం తెచ్చుకొని సంస్కరించుకోవాలని హితవు పలికారు. ఆడబిడ్డలపై అడ్డగోలుగా మాట్లాడి పారిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ మండిపడ్డారు.

## ఇది కాంగ్రెస్ దురహంకారం

**విశ్వంభర,హైదరాబాద్:** అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకు ఆయన క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ఇది యావత్ మహిళా లోకానికి జరిగిన అవమానమన్నారు.'నిండు అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సభానాయకులు, రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. మందబలంతో కాంగ్రెస్ ప్రదర్శిస్తున్న ఈ దురహంకారాన్ని రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారని... కాంగ్రెస్ చేస్తున్న ఒక్కో తప్పును లెక్కబెడుతున్నారని హరీశ్ రావు అన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ సమావేశాలను ఎంతో హుందాగా నిర్వహించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ, ప్రతిపక్షాల గొంతును నొక్కుతూ కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరి గర్హనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు."ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతిపక్షంగా మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడమే తప్పా? రైతన్నల ఆత్మహత్యలు, నేతన్నల మరణాలు, ఆటో కార్మికుల బలవన్మరణాలపై ప్రభుత్వాన్ని నిలదీయడమే మేము చేసిన తప్పా? విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పట్ల అసెంబ్లీ సాక్షిగా గొంతెత్తడమే మేము చేస్తున్న తప్పా?" అని ఆయన ప్రశ్నించారు.

## తిరస్కరించినా మోదీ తీరు మారలే!

**(మొదటి పేజీ తరువాయి)**
నరేంద్రమోదీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తారు. కానీ, జాతి హింసకు గురై అల్లర్లతో అతలాకుతలమైన మణిపూర్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపరు. ఆ రాష్ట్రానికి వెళ్లి సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు చొరవ తీసుకోవడానికి మోదీ నిరాకరిస్తున్నారు' అని విమర్శించారు. మణిపూర్, జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి ఘటనలు, కన్వరీ యాత్ర, బడ్జెట్ కేటాయింపులు వంటి అంశాలను ప్రస్తావిస్తూ.. మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అదేవిధంగా కాన్వరీ యాత్రపై కూడా సోనియా స్పందించారు. ఈ యాత్రపై సరైన సమయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కూడా సోనియా స్పందించారు. ఈ బడ్జెట్‌లో రైతులు, యువత డిమాండ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కీలకమైన అనేక రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని విమర్శించారు. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడుల ఘటనను కూడా సోనియా ప్రస్తావించారు. కొన్ని వారాలుగా ఒక్క జమ్మూ ప్రాంతంలోనే కనీసం 11 ఉగ్రదాడులు జరిగాయన్నారు. ఈ దాడుల్లో ఎంతో మంది భద్రతా సిబ్బంది, పెద్ద సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఘటనలు జమ్మూ కశ్మీర్‌లో అన్నీ బాగానే ఉన్నాయని మోదీ ప్రభుత్వం చేస్తున్న వాదనలను అపహాస్యం చేస్తున్నాయన్నారు.మణిపూర్ అంశాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో పరిస్థితులు ఇప్పుడే మెరుగుపడే సూచనలు కనిపించడం లేదన్నారు.

**పరిస్థితులు మనకే అనుకూలం..అయినా అతి విశ్వాసం వద్దు**

దేశ ప్రజలు కాంగ్రెస్ పట్ల సానుకూలంగా ఉన్నారని సోనియాగాంధీ అన్నారు. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నప్పటికీ అతి విశ్వాసం పనికిరాదని పార్టీ నేతలకు సూచించారు.రానున్న నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం కావాలని ఈ సందర్భంగా నేతలకు సూచించారు. 'రానున్న కొన్ని నెలల్లో నాలుగు రాష్ట్రాల (మహారాష్ట్ర, హర్యానా, ఝార్ఖండ్, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పరిస్థితులు మనకు అనుకూలంగానే ఉన్నాయి. అయినా, మనం ఆత్మసంతృప్తి చెందకూడదు. అతిగా ఆత్మ విశ్వాసంతో ఉండకూడదు. కష్టపడి పనిచేస్తే ఫలితాలు మనకు అనుకూలంగా వస్తాయి. లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ అదే ఊపును కొనసాగిస్తూ.. మంచి పనితీరును కనబరిచినట్లైతే జాతీయ రాజకీయాల్లో మార్పులు తీసుకురాగలం. నేతలంతా కలసికట్టుగా పనిచేయాలి' అని సోనియా పార్టీ నేతలకు సూచించారు.

## కోలుకోని వయనాడ్..

**వయనాడ్:** మహా విపత్తుకు కకావికలమైన వయనాడ్ ఇంకా కోలుకోలేదు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్న కొద్దీ మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రకృతి విలయంలో ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 200 దాటింది.కొండచరియలు విరిగిన పడిన ఘటనలో ఒక కుటుంబంలో 11మంది చిక్కుకుపోగా.. వీరిలో రెండేళ్ల చిన్నారి సహా ముగ్గురి మృతదేహాలను సహాయక సిబ్బంది శిథిలాల కింద నుంచి వెలికి తీశారు. మిగతా 8 మంది ఎక్కడున్నారో ఇంకా ఆచూకీ తెలియరాలేదని అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే ముండక్కై గ్రామానికి చెందిన మహ్మద్ అలీస్ కుటుంబం తృటిలో ఈ పెను విపత్తు నుంచి బయటపడింది. వర్షాల కారణంగా విపత్తును ముందే ఊహించిన అలీస్ భార్య షకీరా అక్కడి నుంచి వెళ్లిపోదామని పట్టుబట్టింది. తొలుత కుటుంబ సభ్యులెవరూ ఆమె మాటలు పట్టించుకోలేదు. కానీ, తీవ్రంగా ఒత్తిడి చేయడంతో సోమవారం రాత్రి 16 కిలోమీటర్ల దూరంలోని మెప్పడి వెళ్లి అక్కడ ఓ సురక్షిత ప్రాంతంలో తలదాచుకున్నారు.

**అదానీ రూ.5 కోట్ల విరాళం..**

వయనాడ్‌లో ఈ ఘటనపై ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ విచారం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 కోట్ల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన ట్వీట్ చేశారు. వయనాడ్‌లో సంభవించిన విపత్తు అనేకమంది ప్రాణాలను బలితీసుకోవడం తన మనసును కలచివేసిందన్నారు. కష్ట సమయంలో అదానీగ్రూప్ కేరళకు సంఘీభావం ప్రకటిస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కేరళ సర్కారు చేపడుతున్న సహాయక చర్యలకు మద్దతుగా రూ.5 కోట్ల విరాళం అందిస్తున్నట్లు తెలిపారు.

# ఒక్కమాటా తప్పు మాట్లాడలేదు

**విశ్వంభర, హైదరాబాద్:** అసెంబ్లీలో తాను ఎక్కడా అసభ్యంగా, అన్ పార్లమెంటరీగా కానీ మాట్లాడలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితకు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇచ్చారన్నారు. సబితా ఇంద్రారెడ్డి తన వ్యక్తిగత విషయాలను మాట్లాడినందుకే, తాను మిగతావి కూడా చెప్పి పూర్తి చేసినట్లు తెలిపారు. సునీతా లక్ష్మారెడ్డి కోసం 2018 ఎన్నికల ప్రచారానికి వెళ్తే తనపై రెండు కేసులు పెట్టారని, కౌడిపల్లి, నర్సాపూర్‌లో అవి ఇప్పటికీ ఉన్నాయన్నారు. కానీ సునీత లక్ష్మారెడ్డి అధికార పార్టీలోకి వెళ్లాక తన కోసం ప్రచారం చేసిన తమ్ముడిపై కేసులు తీసేయాలని కోరకుండా మహిళ కమిషన్ పోస్టు తీసుకొని ఆ తర్వాత ఎమ్మెల్యే అయితే సరిపోతుందా అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

అక్కల మాటలు నమ్మి మోసపోయానని కేటీఆర్ చెప్పానన్న సీఎం సభలో ఎవరి పేరు ప్రస్తావించలేదని అన్నారు. తనను కాంగ్రెస్‌లోకి రమ్మని చెప్పిన సబితక్క అండగా ఉండాల్సింది పోయి పార్టీ మారారన్నారు. తన ఎన్నిక బాధ్యత తీసుకుంటానన్న ఆమె నామినేషన్ వేసేటప్పటికే వ్యతిరేక ప్రచారం మొదలు పెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. మోసానికి పర్యాయపదమే సబితా ఇంద్రారెడ్డి అని భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారన్నారు. తనకు అన్యాయం జరిగిందంటూ సబితా ఇంద్రారెడ్డి ఇంత అవేదన చెందుతుంటే కేసీఆర్, హరీశ్ రావు ఎటుపోయారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

**ఫ్లోర్ లీడర్‌గా కేసీఆర్ ఎందుకు?**

అసెంబ్లీకి వచ్చి సబితక్కకు అండగా ఉండకుండా ఎందుకు దుమ్మాకొట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో మాట్లాడేందుకు కేటీఆర్, హరీశ్ రావు చాలు అనుకుంటే కేసీఆర్‌ను ఎందుకు ఫ్లోర్ లీడర్‌గా ఎన్నుకున్నా రని ప్రశ్నించారు. అలాంటప్పుడు ఫ్లోర్ లీడర్‌గా కేసీఆర్‌ను తొలగించాలని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు రాష్ట్రం పట్ల పట్టింపు లేదని ధ్వజ మెత్తారు. కేసీఆర్‌కు అధికారం లేకపోతే ప్రజల సమస్యలను పట్టించుకునే ఆలోచన ఉండదన్నారు.

**శాసనసభను ప్రజాస్వామ్యబద్ధంగా నడుపుతున్నాం**

గత పదేళ్లతో పోలిస్తే అసెంబ్లీని తాము ప్రజాస్వామికంగా నడుపుతున్నామని సభలో విపక్ష సభ్యులకే ఎక్కువ టైమ్ లభించిందని సీఎం అన్నారు. చాలా టైం ఇచ్చినా అవకాశం ఇవ్వలేదని విపక్ష నేతలు అంటున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో ఇంత సుదీర్ఘ చర్చలు ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ జరగలేదని ఒక్కో రోజు 17 గంటల పాటు సభ జరిగిందన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్,



హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి ముగ్గురే ఆరు గంటల పాటు మాట్లాడరని తనతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ముగ్గురం కలిసి కూడా అంతసేపు మాట్లాడలేదన్నారు.అసెంబ్లీ సమావేశాలు పూర్తి ప్రజాస్వామికంగా, బాధ్యతగా జరుగుతున్నాయని చర్చను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినప్పటికీ బాధ్యతగా వ్యవహరించామని సీఎం అన్నారు. బడ్జెట్, పద్దులు, ద్రవ్య వినిమయ బిల్లుపైనా అందరికీ మాట్లాడే అవకాశం లభించిందని, వీలైనంత చర్చ జరిగిందన్నారు. బుధవారం లోగా ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందటం తప్పనిసరి కాబట్టి తక్కువ రోజులు జరిగినట్లు అనిపించినప్పటికీ ఒక్కో రోజు 17 గంటలపాటు సభ జరిగిందన్నారు. ఎన్ని రోజులు జరిగిందనే దానికంటే ఎంత సమయం చర్చ జరిగిందనేది ముఖ్యమన్నారు.

**కలిసి టీ తాగితే పార్టీ మారినట్లా?**

అసెంబ్లీలో బహిష్కరణలు, సస్పెన్షన్లు, మార్షల్స్ అవసరం రావద్దని తమ ఆలోచనని అయితే అలాంటి అవసరం, సందర్భం వస్తే స్పీకర్ తగిన నిర్ణయం తీసుకుంటారని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవసరాన్ని బట్టి ఎమ్మెల్యేల సభ్యత్వం కూడా రద్దు కావొచ్చునన్న సీఎం గతంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్ సభ్యత్వాలు రద్దు చేశారని ప్రస్తావించారు. గతంలో తనను కూడా ఒక సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తే నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరుగుతోందని హైకోర్టులో పిటిషన్ వేసినట్లు తెలిపారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్‌లో చేరారన్న ప్రచారంపై స్పందించిన ముఖ్యమంత్రి కలిసి టీ తాగేందుకు వెళ్లి ఉంటారన్నారు. కలిసి టీ తాగడానికి, పార్టీలో చేరడానికి సంబంధం ఉండదన్నారు. ఇటీవల 8, 9 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చి తనతో టీ తాగారని అంత మాత్రాన వారందరూ కాంగ్రెస్‌లో చేరినట్టా అని ప్రశ్నించారు.

# అక్కల మాటలు వింటే బస్‌స్టాండే దిక్కు

**(మొదటి పేజీ తరువాయి)**
మాట్లాడుతున్నారని, సబిత బాధ ఎంటో అర్థం కావట్లేదని ఆయన చెప్పారు.

**అండగా ఉంటానన్న సబిత మోసం చేసింది**

అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు సభకే రాడని, ఇక తమతో ఏం కలిసి వస్తారని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. మీ వెనకాల ఉన్న అక్కల మాటలు వింటే కేటీఆర్ జూబ్లీ బస్‌స్టాండ్‌లో కూర్చోవాల్సి వస్తుదంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలను కించపరిచారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లారు.దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇస్తూ కాంగ్రెస్‌ను, తనను మోసం చేసిన సబితక్కతో జాగ్రత్తగా ఉండాలని చెప్పానని అన్నారు. తాను చెప్పే మాట నిజమా? కాదా? అనేది సబితక్క గుండె మీద చేయి వేసుకొని చెప్పాలని రేవంత్ రెడ్డి చెప్పారు. వ్యక్తిగతంగా జరిగిన చర్చను సబితక్క సభలో పెట్టిందని పేర్కొన్నారు. నువ్వు కాంగ్రెస్‌లోకి వస్తే ముఖ్యమంత్రివి అవుతావని సబితక్క తనతో చెప్పిందని, అలాగే మల్కాజిగిరి లోక్‌సభ నుంచి పోటీ చేయాలని సూచించింది కూడా సబితక్కేనని రేవంత్ రెడ్డి చెప్పారు. ఇన్ని మాటలు మాట్లాడిన సబితక్క తమ్ముడిని మోసం చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్లిందని ఎద్దేవా చేశారు.

**ఏం మోసం చేశామో చెప్పండి : సబిత**

రేవంత్ రెడ్డిని నువ్వు చాలా గొప్పోడివి అవుతావు అని ఒక అక్కలా ఆశీర్వదించానని, ఇప్పుడు ఆయన తనను టార్గెట్ చేసి మాట్లాడుతున్నాడని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎందుకు కక్ష తీర్చుకుంటున్నారని ఎదురుదాడికి దిగారు. కేసీఆర్ ఇంటి మీద వాలిన కాకి తన ఇంటి మీద వాలితే కాల్చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటున్నారని ఆమె ప్రశ్నించారు. అక్కల మాట వింటే జూబ్లీ బస్టాండ్‌లో కూర్చోవాల్సి వస్తుందంటూ రేవంత్ రెడ్డి.. కేటీఆర్‌ను ఉద్దేశించి చెప్పడం పట్ల సబితా ఇంద్రారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటీఆర్‌ను తాము ఏం మోసం చేశామో చెప్పాలంటూ పట్టుబట్టారు. రేవంత్ రెడ్డి తన మాటలను వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

## రాష్ట్ర నూతన గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ ప్రమాణం

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం నాలుగో గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రాజ్ భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కొత్త గవర్నర్‌తో ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులు, కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై గవర్న ర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు మధ్యాహ్నం అగర్తలా నుంచి బయ లుదేరిన గవర్నర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో మంత్రులు ఉన్నతాధికారులతో కలిసి ఘనస్వాగతం పలికారు. తెలంగాణ సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. రాజ్‌భవన్‌లో సందడి వాతావరణం నడుమ ప్రమాణ స్వీకార ఘట్టం పూర్తయింది.



**రాజ కుటుంబీకుడు**

1957 ఆగస్టు 15న జన్మించిన జిష్ణుదేవ్ వర్మ, త్రిపుర రెండో డిప్యూటీ సీఎంగా 2018 నుంచి 2023 వరకు పని చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగానూ గతంలో సేవలందించారు. ఆయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి. 1990లో భారతీయ జనతా పార్టీలో చేరి ముఖ్యపాత్ర వహించారు. రామజన్మభూమి ఉద్యమంలోనూ ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. తెలంగాణ బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులుకాగా, ఆ రాష్ట్రానికి చెందిన నాయకుడు తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా రావడం విశేషం.

**రాష్ట్ర అభ్యున్నతికి పాటుపడతా:**

**జిష్ణుదేవ్ వర్మ**

తెలంగాణ చైతన్యవంతమైన ప్రాంతమని కొత్త గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. వ్యాపారాలకు సైతం రాష్ట్రం కేంద్రబిందువుగా మారిందన్నారు. రాష్ట్రంలో యువకుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని, మంచి మంత్రివర్గం ఉందని, వారితో కలిసి రాష్ట్ర అభ్యున్నతికి పాటు పడుతానని తెలిపారు. సుస్థిర ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక అంశాల్లో తెలంగాణను అగ్రగామిగా ఉంచేందుకు అందరితో కలిసి పనిచేస్తానన్నారు.

# చైనాతో చర్చలు నిర్మాణాత్మకం

**ఢిల్లీ:** తూర్పు లద్దాఖ్‌లో సరిహద్దు వివాదంపై భారత్ చైనా మధ్య 30వ విడత చర్చలు బుధవారం ఢిల్లీలో జరిగినట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇవి కూలంకషంగా, నిర్మాణాత్మకంగా, పురోగతి దిశగా సాగినట్లు తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాల్లో సాధారణ స్థితి పునరుద్ధరణకు.. శాంతిస్థాపన, నియంత్రణ రేఖ (ఎల్ఓసి) ల పట్ల గౌరవం అవసరమని స్పష్టం చేసినట్లు భారత్ వెల్లడించింది. ఇటీవల క్వాడ్ సమావేశం సందర్భంగా ఇరుదేశాల సరిహద్దు సమస్యను విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఇరుదేశాల విదేశాంగ మంత్రుల మధ్య ఇటీవల ఆస్తానా, లావోస్‌లో చర్చలు జరిగాయి. ఈక్రమంలోనే పెండింగులో ఉన్న సమస్యలకు సంబంధించి ముందస్తు పరిష్కారాన్ని కనుగొనే ఉద్దేశంతో వాస్తవాధీన రేఖ వెంట ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఇరుపక్షాలు సమీక్షించినట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. భారత బృందానికి విదేశీ వ్యవహారాలశాఖ సంయుక్త కార్యదర్శి(తూర్పు ఆసియా) గౌరాంగల్ దాస్ నేతృత్వం వహించగా.. చైనా తరపున చైనా విదేశాంగ శాఖకు చెందిన సరిహద్దు విభాగాల డైరెక్టర్ జనరల్ హాంగ్



లియాంగ్ సారథ్యం వహించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# దేశ రాజధానిలో రెడ్అలర్ట్ జారీ..!

- దిల్లీ, ఉత్తరాఖండ్, యూపీలో కుండపోత వర్షం
- విమాన రాకపోకలకు అంతరాయం..

**ఢిల్లీ:** వేడిగాలులతో సతమతమవుతున్న రాజధాని ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉత్తరాదిలో మళ్లీ వరుణుడు ఉగ్రరూపం దాల్చాడు. ఉత్తరాఖండ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌తోపాటు పలు ప్రాంతాల్లో కుంభవృష్టి వర్షం కురుస్తోంది. దిల్లీలో భారీ వర్షాలకు జనజీవితం అస్తవ్యస్థంగా మారింది. కొద్దిరోజుల క్రితం ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు ప్రాణాలు కోల్పోయిన రాజేంద్రనగర్‌లో మళ్లీ భారీ వర్షం కురిసింది. పోలీసుల బారికేడ్లు నీట మునిగాయి. రాజేంద్రనగర్‌లోని సెల్లార్లలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. హస్తినలోని పలు రోడ్లు నదులను తలపిస్తున్నాయి.

**విమాన రాకపోకలకు అంతరాయం..**

భారీవర్షాలతో విమానాల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోంది . ప్రతికూల వాతావరణం కారణంగా 10 విమానాలను దారిమళ్లించారు. భారీవర్షం లోనే విద్యార్థులు తమ ఆందోళనలను కొనసాగించే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో రానున్న 24 గంటల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అలర్ట్ జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఢిల్లీలో చాలా చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు ఢిల్లీతోపాటు ఎన్సీఆర్ పరిధిలో భారీవర్షాలు కురుస్తున్నాయి. నోయిడా, ఘజియాబాద్ , గుర్‌గావ్ , ఫరీదాబాద్‌లో కుండపోత కురిసింది. సాయంత్రం కార్యాలయం నుంచి బయటకు వచ్చిన ఉద్యోగులు వర్షం కారణంగా రోడ్లపైనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం రెండు గంటలపాటు కురిసిన వర్షానికి ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అయింది.

## నా సోదరుడిని ఆదుకోండి



**విశ్వంభర, కూసుమంచి:** "నా సోదరుడు యల్లాచారి తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నాం. కాలేయ మార్పిడి ఒక్కటే ఆయన ప్రాణాలను కాపాడగలదని వైద్యులు చెప్తున్నారు. ఆపరేషన్‌కు, అనంతర సంరక్షణకు రూ.30లక్షలు అవసరమని అంటున్నారు. ఇప్పటికే మా కుటుంబ వనరులను, పొదుపు మొత్తాలను వినియోగించాం. ఇంకా పెట్టే స్థోమత మాకు లేదు. ఈ క్లిష్టసమయంలో స్నేహితులు, బంధువులే కాకుండా మానవతావాదులు స్పందించి ఆదుకోవాలి" అని కోరుతున్నారు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామానికి చెందిన మారోజు భీష్మచారి. 9848330804 & 9948202535 నంబర్లకు విరాళాలు పంపాలని ఆయన కోరారు.

## నిండుసభలో మహిళలను అవమానిస్తారా?

**విశ్వంభర, హైదరాబాద్:** శాసన సభలో ఏం జరిగిందో ప్రజలందరూ చూశారని, మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో కేటీఆర్ ప్రతి అంశాన్ని కూలంకషంగా వివరించే ప్రయత్నం చేశారని, కేటీఆర్ ప్రసంగం నుంచి దృష్టి మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి మహిళా సభ్యులపై వ్యాఖ్యలు చేశారని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. నిండు సభలో మహిళలపై మాట్లాడి సీఎం పీఠాన్నే రేవంత్‌రెడ్డి అగౌరపరిచారని ఆందోళన వ్యక్తం చేశారు.ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లు అనంతరం సభ గురువారానికి వాయిదాపడింది. అనంతరం సీఎం వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు లాబీ నుంచి మీడియా పాయింట్ వరకు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి మహిళలు అంటే గౌరవం లేదని, సోనియా మొదలు తన వరకు అందరిపై సీఎం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కలను నమ్ముకుంటే ముంచుతారని, జూబ్లీ బస్టాండ్‌లో కూర్చోవలసి వస్తుందని సీఎం రేవంత్ అసెంబ్లీలో వ్యాఖ్యానించారని సబిత వాపోయారు. రేవంత్ కాంగ్రెస్‌లోకి రాకముం దే హస్తం పార్టీకి తాము సేవలందించామని సబిత ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. భుజాన జెండా వేసుకుని కాంగ్రెస్ కోసం కష్టపడ్డామని, కాంగ్రెస్ అధికారంలోకి రావాలని తాను, సునీత కోరుకున్నట్లు ఆమె తెలిపారు. తాను, సునీత పార్టీకి మోసం చేశామని రేవంత్ మాట్లాడారని, రేవంత్‌ను కాంగ్రెస్‌లోకి రావాలని కోరడమే తాను చేసిన తప్పని ఆమె తెలిపారు. ఆడబిడ్డలు క్షేమం కోరుకుంటారు, నమ్మినవారికి ప్రాణం ఇస్తారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ రోజు జరిగిన అవమానం సునీత, సబితకు మాత్రమే కాదని, సభలో జరిగిన దానిపై ప్రతి ఇంట్లోని ఆడపిల్లలు ఆలోచిస్తున్నారని ఆమె తెలిపారు. 24 ఏళ్ల నుంచి తాను అసెంబ్లీకి వస్తున్నానని, సీఎం పీఠంపై చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్‌లను చూశానన్నారు. ఈరోజు సీఎం పీఠంపై రేవంత్‌రెడ్డిని కూడా చూస్తున్నారు. రేవంత్ నిండుసభలో మహిళలను అవమానించారన్నారు.

### ఎమ్మెల్సీ కవితకు మరోసారి తప్పని నిరాశ

**విశ్వంభర, హైదరాబాద్:** దిల్లీ లిక్కర్ కుంభకోణంలో మార్చి 16 నుండి తీహార్ జైలు జీవితాన్ని అనుభవిస్తున్న ఎమ్మెల్సీ కవితకు మరో మారు కోర్టులో తీవ్ర నిరాశ ఎదురైంది. బుధవారంతో కవిత జ్యుడీషియల్ రిమాండ్ ముగియడంతో వర్చువల్ గా ఈడి అధికారులు కవితను కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో ఢిల్లీలోని హౌస్ అవెన్యూకోర్టు ఎమ్మెల్సీ కవితకు జ్యూడిషియల్ రిమాండ్‌ను ఆగస్టు 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పలుమార్లు ఆమె పెట్టుకున్న బెయిల్ అభ్యర్థనలను తిరస్కరించింది. కేసు విచారణ కీలక దశలో ఉందని కాబట్టి కవిత రిమాండ్‌ను పొడిగించాలని ఈడీ న్యాయస్థానాన్ని అభ్యర్థించడంతో ఈడీ వాదనాలతో ఏకీభవించిన న్యాయస్థానం మళ్లీ కవిత రిమాండ్ ను 14 రోజులు పొడిగిస్తూ తీర్పిచ్చింది.

**సిబిఐ ఈ ఛార్జ్ షీట్ పై మరోసారి విచారణ వాయిదా...**

ఇదిలా ఉంటే ఢల్లీ లిక్కర్ కుంభకోణం లో సిపిఐ కేసును ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత కేసులో బుధవారం కోర్టులో సిబిఐ లిక్కర్ కేసు చార్జ్ షీట్ పై విచారణ జరగాల్సి ఉండగా వర్చువల్ గా కోర్టులో కవితతో పాటు ఇతర నిందితులను హాజరు పరిచారు. సిబిఐ అధికారులు సిబిఐ కేసులో ఎమ్మెల్సీ కవిత ఏ17 గా ఉన్నారు. అయితే ఈ కేసులో సిబిఐ ఈ ఛార్జ్ షీట్ పై మరోసారి విచారణను ఆగస్టు 9వ తేదీకి వాయిదా వేసింది.

## బాలికపై అత్యాచారం, హత్య కేసులో ముద్దాయికి ఉరి శిక్ష

**(మొదటి పేజీ తరువాయి)**
ఉరిశిక్ష విధించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ నిందితుడు హైకోర్టును ఆశ్రయించాడు. బుధవారం ఆ పిటిషన్‌పై విచారణ జరగ్గా రంగారెడ్డి కోర్టు తీర్పును రాష్ట్ర హైకోర్టు సమర్థిం చింది. కాగా, బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన యువ కుడు సెంట్రింగ్ పనిచేసే కార్మికుడిగా పోలీసులు గుర్తించారు.



# ప్రభుత్వ వైద్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- ధర్మాసుపత్రి పై దయ చూపండి..!
- భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు వైద్య సిబ్బందిని నియమించాలి
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన దీక్ష

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** ధర్మాస్పత్రి పై దయ చూపండి, ప్రభుత్వ వైద్యాన్ని కాపాడండి, పేదవాడికి ప్రభుత్వ వైద్యం అందకుండా చేస్తున్న కుట్రను తిప్పికొట్టండి, నిడదీస్తూ సీపీఐఎం చేపట్టిన నిరసన దీక్ష నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతమైన భద్రాచలం పట్టణంలో అతిపెద్ద చరిత్ర కలిగి ఉన్న 200 పడకల ఆసుపత్రి పై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వీడాలని హాస్పిటల్ లో పోస్టులన్నీ భర్తీ చేయాలని సీఎం పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యం లో ఒక్క రోజు నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. భద్రాచలం ప్రముఖులు భద్రాద్రి కళాభారతి అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ హాస్పిటల్ కు చుట్టుపక్క ప్రాంతాల గిరిజన ప్రాంతాల ప్రజలు, అనేకమంది పేదవారికి నిరంతరం అందుబాటులో ఉండి ఏజెన్సీ ప్రజల ప్రాణాలు రక్షిస్తుందని అన్నారు. అటువంటి ఏజెన్సీ సంజీవని గా పిలవబడే ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు వైద్య సిబ్బంది లేకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమస్యపై సీపీఎం పార్టీ చేపట్టిన నిరాహార దీక్ష సబబేనని వెంటనే ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు డాక్టర్స్ ని ఇతర సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు. అనంతరం సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గతంలో కలెక్టర్ ని ఐటీడీఏ పీవో ని స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుని కలిసి వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇక్కడున్న పరిస్థితులకు ప్రత్యక్ష సాక్షి స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు అన్నారు. ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడం వల్ల ఆయనే స్వయంగా వచ్చి డెలివరీలు చేసి అసెంబ్లీకి వెళ్ళటం జరిగిందంటేనే ఇక్కడున్న పరిస్థితికి అద్దం పడుతుందని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఈ ప్రాంత శాసన సభ్యులుగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమస్యలపై చర్చించి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించేలాగా చర్చించే బాధ్యత శాసనసభ్యులు వెంకటరావు పై ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే భద్రాచలం పట్ల గత ప్రభుత్వాలు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించడం వల్లనే చిన్న గోదావరి వచ్చిన అనేక ప్రాంతాలు గోదావరి ముంపుకు గురవుతున్నాయని స్లూయిసులు దగ్గర లీకేజీలు పూడ్చడంలో గాని మోటర్లు పెట్టడంలో గాని ఇరిగేషన్ సిబ్బంది సరైన చర్యలు తీసుకోకపోవడం వలన 50 అడుగుల కే కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీలో వరద నీరు ప్రవహిస్తుందని విమర్శించారు. వరద పర్యటనకు వచ్చినటువంటి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఒక చుక్క కూడా భద్రాచలంలో నీట మునగనివ్వనని చెప్పినందున ఆ దిశగా చర్యలు చేపట్టాలని నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికైనా భద్రాచలం పట్ల వివక్షను విడనాడి ఏరియా ఆసుపత్రిలో వైద్యులను నర్సులను ఇతర సిబ్బందిని వెంటనే నియమించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న సానిటేషన్ కాంట్రాక్ట్ కార్మికుల కు గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆ వేతనాలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆసుపత్రి సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజలను ప్రజాసంఘాలను స్వచ్ఛంద సంఘాలను అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సీపీఎం చేస్తున్న నిరాహార దీక్ష శిబిరానికి లైన్స్ క్లబ్ అధ్యక్షులు సీ.హెచ్ రామలింగేశ్వర రావు సీనియర్ లైన్ మెంబర్ యోగి సూర్యనారాయణ, ఫాస్ట్ ప్రెసిడెంట్ పల్లింటి దేశప్ప ఫాస్ట్ సెక్రెటరీ డి రాజు తదితరులు సంఘీభావం తెలుపగా సాయంత్రం దీక్షను ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవరెడ్డి రోటరీ క్లబ్ కార్యదర్శి విద్యాసాగర్ ట్రెజర్ శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి విరివింపజేశారు. ఈ కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట్ రామారావు, పి సంతోష్, ఎన్ లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి లక్ష్మి, నాగరాజు, కుంజ శ్రీను, లక్ష్మణ్, ఫిరోజ్, కోరాద శ్రీను, రత్నం భూపేందర్, రవి, డి రాఘవయ్య, కనక శ్రీ, కుంజా విజయ, వెంకన్న, ఆది, పోసి, సక్కుబాయి, సుశీల, లక్ష్మణ్, సరోజినీ, కాకారమణా, ఎస్కే చోటేమా, అలీమా, గణపతమ్మ పాల్గొన్నారు.

# రోమన్ ఇస్ ల్యాండ్ ఘనంగా ప్రారంభం

**విశ్వంబర, వనస్థలిపురం :** హయత్ నగర్ డివిజన్లోని రోమన్ ఇస్ ల్యాండ్ నవజీవన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగినది, మేనేజ్మెంట్ ను ఇక్కడి ప్రజలకు సరసమైన ధరలకు, నాణ్యమైన దుస్తులను అందిస్తారని కోరుకుంటున్నానన్నారు. మేనేజ్మెంట్ బిట్ట ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మా మొదటి బ్రాంచి, ఇక్కడ ప్రారంభించాము, నాణ్యమైన దుస్తులను, డిస్కౌంట్ ఆఫర్లతో, ఇక్కడి ప్రజలకు అందిస్తాము. కేవలం మెన్స్ వేర్ అందుబాటులో ఉంటాయి డిస్కౌంట్ ఆఫర్ 50% లైఫ్ టైం మేము అందిస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో శంకర్ దీపక్, షాపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# సూపరిండెంట్ శ్యాంసుందర్రావుకు ఘనంగా వీడ్కోలు

**విశ్వంభర, తలకొండపల్లి, :** తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సూపరిండెంట్ గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్రావు బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక దేవకి గార్డెన్లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ లు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, నిర్మల శ్రీశైలం గౌడ్ లు హాజరై వారికి శాలువాలతో సన్మానం చేశారు. మండలానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీఓ రఘు, ఏవో రాజు, మాజీ సర్పంచ్ లు దశరథ్ నాయక్, మోహన్ రెడ్డి, బోస్ వెంకటయ్య, విజయ్ రెడ్డి, లింగం గౌడ్, భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు పాల్గొన్నారు.








# అనుమతి లేకుండా రేవ్ పార్టీ

- బిగ్ బాస్ ఫేమ్ మహబూబ్ షేక్ అరెస్ట్

**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అంకుశాపూర్ కాంటినెంట్ రిసార్ట్స్ లో ఎలాంటి అనుమతి లేకుండా బిగ్‌బాస్ ఫేమ్ మహబూబ్ షేక్ రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. 10 లీటర్ల లిక్కర్, 5 లీటర్ల బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకొని బిగ్ బాస్ మహబూబ్ షేక్, పార్టీ ఆర్గనైజర్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాంటినెంట్ రిసార్ట్‌లో జరిగిన పార్టీకి బుల్లితెర నటులు, పలువురు సెలబ్రిటీలు హాజరైనట్టు సమాచారం.



# రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**విశ్వంభర, ముషీరాబాద్ :** ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అసంఘటిత రంగంలోఉన్న రవాణా కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మేరకు తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనీ సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక రవాణా రంగంలోఉన్న ఆటో, క్యాబ్, డీసీఎం, లారీ, బస్సు డ్రైవర్లు దుర్భరమైన జీవితాలు వెళ్లదీస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర సమితి హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో బుధవారం వేలాది మంది ఆటో డ్రైవర్లతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ 2014 సంవత్సరం నుండి ఆటో మీటర్ చార్జీలు పెంచకుండా, ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని విమర్శించారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో, క్యాబ్ మీటర్ చార్జీలు పెంచాలన్నారు, పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రయాణ సౌకర్యం కోసం కొత్త ఆటో పర్మిట్లను జారీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మావోయిస్టులకు సహకరించవద్దు

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలం దండేపల్లి గుంపు గుత్తి కోయగూడెంలో కాటారం సీఐ నాగార్జున రావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గూడెంలోని గుంపులో కొత్తవారు ఎవరొచ్చినా వెంటనే సమాచారం అందించాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. మావోయిస్టులకు సహకరించవద్దని వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించిన వారికి కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఆయన వెంట మహా ముత్తారం ఎస్సై మహేందర్ కుమార్ తోపాటు సివిల్ సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.







## భారత ఆధునిక జీవశాస్త్ర పితామహులు

# పి.ఎం.భార్గవ

### నేడు ఆయన వర్ధంతి



పుష్ప మిత్ర భార్గవ (పి.ఎం.భార్గవ) భారత దేశపు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలలో ఒకరు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) వ్యవస్థాపక డైరెక్టర్. భారత దేశంలో ఆధునిక జీవశాస్త్రం వాస్తుశిల్పిగా ప్రసిద్ధి చెందారు. భారత దేశంలో బయోటెక్నాలజీ రంగంలో మార్గదర్శకుడు, "జెనెటిక్ ఇంజనీరింగ్" అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తులలో ఒకరు. 70 వ దశకంలో బయో టెక్నాలజీ విభాగం ఏర్పాటులో భార్గవ కీలక పాత్ర పోషించారు. ఆయన హైదరాబాదులో మెడికల్ అవేర్ అండ్ రెస్పాన్సిబుల్ సిటిజన్స్ ఛైర్మన్ కూడా. భార్గవ 1928 ఫిబ్రవరి 22 న రాజస్థాన్ లో ఒక మధ్య తరగతి కుటుంబంలో, వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడైన రామ్ చంద్ర భార్గవ, గాయత్రి భార్గవ దంపతులకు జన్మించారు. 29 ఏళ్ళప్రాయంలో కుటుంబం వారణాసికి మారగా, నేరుగా తొమ్మిదవ తరగతికి బెసెంట్ థియోసాఫికల్ స్కూల్లో చేరాడు. పాఠశాల తర్వాత, అతను ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తమ సంస్థలలో ఒకటైన క్వీన్స్ కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 1944 లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తో బీఎస్సీ, 1446లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ అలాగే 1949 లో 21 సంవత్సరాల వయస్సులో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీ హెచ్ డీ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి 1950 నుంచి 1953 మధ్య కాలంలో ప్రస్తుతం ఉన్న ఐఐసీటీలో, ఉస్మానియా యూనివర్సిటీలో పరోశధకుడిగా పనిచేశారు. తర్వాత 1953 నుంచి 56 వరకు అమెరికా వెళ్ళి అక్కడి యూనివర్సిటీ ఆఫ్ విస్కానిసన్, మెడిసన్‌లో ప్రఖ్యాత శాస్త్రవేత్త హెడెల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశారు. 1956- 57 వరకు లండన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రిసెర్చ్‌లో పనిచేసి, 1977లో ఇండియాకు వచ్చి తిరిగి హైదరాబాద్ లోని సెంట్రల్ లాబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో చేరారు. తర్వాత ఐఐసీటీలో పనిచేస్తూనే, ఆధునిక జీవశాస్త్ర విభాగాలలో పరిశోధన సంస్థ అయిన హైదరాబాద్ సెంటర్ ఆఫ్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీని స్థాపించారు.

1977 ఏప్రిల్ 1 న అది సెమీ అటానమస్ కేంద్రంగా స్థాపించ బడింది.1990 లో డైరెక్టర్ పదవి నుంచి రిటైర్ అయ్యారు. భార్గవ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీలలో పనిచేశారు. 50 కి పైగా దేశాలలో పర్యటించారు. భార్గవ భారత ప్రభుత్వ విధానాల గురించి బాగా తెలిసిన వ్యక్తి. నేషనల్ నాలెడ్జ్ కమిషన్‌లో వైస్ ఛైర్మన్ పదవిని పొందారు. జాతీయ భద్రతా సలహా మండలిలో సభ్యుడిగా, భారత ప్రభుత్వ జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీలో భారత సుప్రీంకోర్టు నామినీగా పనిచేశారు. భార్గవ చాలాకాలంగా సైన్స్, హేతుబద్ధతను ప్రోత్సహించడంలో, మూఢనమ్మకాలను వ్యతిరేకించడంలో పాలు పంచుకున్నారు. 1946 లో శాస్త్రవేత్తల ట్రేడ్ యూనియన్‌గా స్థాపించిన అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియాతో సంబంధం కలిగి ఉన్నారు. 1976 లో 42 వ రాజ్యాంగ సవరణలో భారతదేశ పౌరుల ప్రాథమిక విధిగా శాస్త్రీయ స్వభావాన్ని పొందు పరచడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు.

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మాలిక్యులర్ బయాలజిస్ట్ గా ఆయన అందించిన సేవలకు గాను 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. భార్గవ 100 కి పైగా జాతీయ, అంతర్జాతీయ గౌరవాలు, పురస్కారాలను అందుకున్నారు. భార్గవ వేలాది ఉపన్యాసాలు ఇచ్చారు. 550 కి పైగా ప్రముఖ వ్యాసాలు, ఆరు పుస్తకాలు రాశారు. 125 కి పైగా శాస్త్రీయ పత్రాలను ప్రచురించారు.

హైదరాబాదు లోని ఉప్పల్‌లోని ఐదు అంతస్తుల నివాసంలో ఒక అంతస్తును పరిశోధన శాలకు, మరో అంతస్తును లైబ్రరీకి కేటాయించారు. ఇటీవలి వరకూ ఆయన అనేక ఫార్మా కంపెనీలకు సలహాదారుగా పని చేశారు. ఆయన సంభవన ట్రస్ట్, భోపాల్, ప్రాథమిక పరిశోధన, విద్య అభివృద్ధి సంఘం (BREAD), దిల్లీలో 2005 =2007 మధ్య నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక దేశ వ్యాప్తంగా అసహనం, దళితులపై దాడులు పెరిగి పోతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ.. 2016లో పద్మభూషణ్ అవార్డును వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించారు.

భారత ప్రభుత్వం విశ్వ విద్యాలయాలలో అకడమిక్ కోర్సులను ప్రవేశపెట్టాలని , జ్యోతిషశాస్త్రంలో సైన్స్ డిగ్రీలను అందించాలని నిర్ణయించుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ ఒక రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వ్రాతపూర్వక పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సిన్హా ఈ మెరిట్‌లెస్ పిటిషన్‌ను కోర్టుకు తీసుకు వచ్చినందుకు ఎలాంటి శిక్షా ఖర్చులు విధించలేదు. భార్గవ కూడా సుప్రీం కోర్టులో సంబంధిత మంత్రిత్వ శాఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా సవాలు చేశారు. దీనిని భారత అత్యున్నత న్యాయస్థానం కూడా తోసిపుచ్చింది. పదవులు చేపట్టడానికి ఎప్పుడూ భయపడని, అధికారానికి ఎప్పుడూ తలవంచని, నచ్చని విషయాలను వ్యతిరేకించే వ్యక్తిత్వం ఉన్న పుష్ప మిత్ర భార్గవ ఆగస్టు 1, 2017 న హైదరాబాదులో మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# తల్లి పాలు... బిడ్డకు ఎంతో మేలు

### ఆగష్టు 1నుంచి 7వరకు... తల్లిపాల వారోత్సవాల సందర్భంగా..

పిల్లలకు తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమనీ, చంటి పిల్లలకు చనుబాలిస్తేనే తల్లికి జన్మ ధన్యమైనట్లనీ, పాలిచ్చేతల్లి ఉంటే చంటిపిల్లలకు ఇంక ప్రపంచంలో ఏమీ అవసరం లేదనీ ఒకనాడు భావించే వారు. పిల్లల్ని కనడం, పాలివ్వడం ఒక వరంగా, మాతృత్వానికి నిదర్శనంగా భావించేవారు. తల్లిపాల ద్వారా ప్రపంచం లోని క్షీరదాలు తమ పిల్లలను తమ పాలతోనే పెంచుతున్నప్పటికీ, ప్రకృతి సహజంగా ప్రసాదించిన తల్లి పాలను ఉపయోగించుకోక పోవడం మానవజాతి పరిణామంలో ఒక చిత్రాతి చిత్రమైన పరిస్థితి. నేడు వివిధ కారణాల వల్ల తల్లిపాలకు ప్రత్యామ్నాయం అనుసరించడం అత్యంత బాధాకరం. తల్లిపాలను భారత దేశంలో కేవలం 37 శాతం మంది పిల్లలే ఆరునెలల వరకు తాగుతున్నారు. అంటే పిల్లలకు ఎంత తక్కువ పాళ్ళల్లో తల్లి పాలు అందిస్తున్నారో అర్థం అవుతోంది. కారణం తల్లిపాల గొప్పతనం తెలియక పోవడం కావచ్చు, కొంతమంది వక్షోజాల అందం తగ్గుతుందనో, లేదా ఇచ్చే వెసులుబాటు లేకపోవడమో కానీ చాలామంది శిశువులకి తల్లిపాల రుచి అందడం లేదు. నిజానికి చనుబాలు పిల్లలకు ప్రత్యేక ఔషధంగా పనిచేస్తాయి. తల్లిపాలను సరిగ్గా పిల్లలకు ఇవ్వగలిగితే ఏటా 8.23 లక్షల మంది పిల్లలను ఐదేళ్ల లోపు మరణించకుండా కాపాడు కోవచ్చు. పిల్లలకు చనుబాలు ఇవ్వక పోవడం వల్ల, రొమ్ము కేన్సర్లతో మరణిస్తున్న మహిళల సంఖ్య 20 వేల వరకు ఉంది అంటే ఈ సమస్య ఎంత ఎక్కువగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తల్లి పాల విశిష్టతను తెలిపే రీతిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు నెల మొదటి వారం రోజులు తల్లిపాల వారోత్సవాలుగా వాబా (వరల్డ్ అలైన్స్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ ఎక్షన్ ) సంస్థ పర్యవేక్షణలో డబ్ల్యు. హెచ్.ఓ, యునిసెఫ్, బి.పి.ఎన్.ఐ వంటి అంతర్జాతీయ, జాతీయ సంస్థల అనుబంధంగా జరుపు తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. పుట్టిన పసి పిల్లలకు శక్తితో పాటు, శారీరక అనారోగ్య



సమస్యలు, మానసిక పరమైన సమస్యలను తల్లి పాలు దరిచేర నియ్యవు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో పలు విధాలైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శిశువుకు తల్లిపాలను మించిన ఆహారం లేదు. ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన తల్లిపాలను తాగించినప్పుడే బిడ్డ ఆరోగ్యంగా పెరగగలుగుతుంది. తల్లి పాలలో కార్బోహైడ్రేట్స్ 7.1%, ఫాట్స్ 4.5%, ప్రోటీన్స్ 0.9%, మినరల్స్ 0.2%, డైజెస్టివ్ ఎంజైమ్స్, హార్మోన్లు, విటమిన్లు, యాంటీ బాడీలు, లింఫోసైట్లు ఉంటాయి. అందుకే తల్లిపాలను తప్పని సరిగా తాగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేస్తోంది. కన్న బిడ్డకు తల్లిపాలు పట్టించడం చాలా అవసరం. తల్లి పాలు తాగడం వల్ల పుట్టిన బిడ్డ రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కనుక బిడ్డకు కనీసం ఆరు నెలలు నిండే వరకైనా తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. మార్గదర్శకాల ప్రకారం 6 నెలల తర్వాత చనుబాలు మరిచి పోయేలా చేసి మరో ప్రత్నామ్నాయ ఆహారం ఇవ్వడం ప్రారంభించాలి. బిడ్డకు అవసరమైన పోషకాలు తల్లిపాల ద్వారా లభించాక, ఇతర ఆహారాల ద్వారా పిల్లలకు పోషకాలను అందించాలి. తల్లి బిడ్డకు తన చను పాలు ఇవ్వడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుంది. అంతేకాకుండా తల్లికి కూడా మేలు జరుగుతుంది. తల్లిపాలు పట్టించడం వల్ల శిశుకు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ, డయేరియా, వాంతుల సమస్య నుంచి రక్షణ లభిస్తుంది. పిల్లలు పెద్దయ్యాక ఊబకాయం, మరికొన్ని ఇతర అనారోగ్య సమస్యల ముప్పు తగ్గుతుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. ప్రసవమయిన మొదటి రోజు నుండీ నాలుగు రోజుల వరకూ రొమ్ముల నుండీ చిక్కటి పసుపు పచ్చటి ద్రవం స్రవిస్తుంది. దీనిని కొలోస్ట్రమ్ లేదా "ముర్రుపాలు" అంటారు. ఆ తర్వాతే తెల్లటి పాలు వస్తాయి. ఈ ముర్రుపాలు శిశువులకు చాలా ముఖ్యం. మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా బిడ్డకు జీర్ణకోశ సంబంధిత సమస్యలు ఉండవు. జీర్ణకోశ వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. చాలా తేలికగా అరుగుదల జరుగుతుంది. బిడ్డకు మలబద్ధక సమస్య ఉండదు. తల్లిపాల వలన ఆస్తమా, చెవి సంబంధించిన వ్యాధులు రాకుండా కాపాడుతుంది. తల్లిపాల వల్ల స్థూలకాయం ఉండదని శాస్త్రవేత్తల పరిశోధనతో తేలింది. తల్లిపాలు... పిల్లల దశలో లుకేమియా వ్యాధి రాకుండా, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి పెద్ద వయస్సులో రాకుండా కాపాడుతుంది. తల్లిపాలు - పిల్లల తెలివి తేటలను పెంచుతుంది. తల్లి పాలలో చాలా ఫాటీ యాసిడ్స్ ఉన్నందున, ఇవి పిల్లలలో మెదడు పెరుగుదలకు ఉపయోగ పడుతుంది. తల్లి పాలకు ఖర్చు పెట్టవలసిన అవసరం లేదు. తల్లి ఒడిలో బిడ్డ ఉన్నందున బిడ్డ చాలా అనుకూలమైన స్థితిలో ఉంటుంది. తల్లి బిడ్డల మధ్య బాంధవ్యం పెరుగుతుంది. అలాగే తల్లికి కల లాభాలలో తల్లిపాలు ఇచ్చినందు వలన తల్లికి ప్రసవానంతర సమయంలో బరువు తగ్గుటకు దోహద పడుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి బాలింత దశలో రక్తస్రావాన్ని తగ్గిస్తుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ లాంటివి రాకుండా స్త్రీని కాపాడుతుంది. ఎంత ఎక్కువ కాలం తల్లి బిడ్డకు పాలు ఇస్తే అంత మంచిది. వ్యాధులు నుండి అంతే ఎక్కువ కాపాడుతుంది. ఆవు లేక గేదె పాలు తీసుకున్న పిల్లలు ఎక్కువ అలర్జీ సమస్యలకు గురి అవుతారు.

# కుల గణనపై చిత్తశుద్ధి లేనిది


# రాహుల్ గాంధీకా? రేవంత్ రెడ్డికా?



పార్లమెంటు లో బుధవారం బడ్జెట్ పై చర్చల సందర్భంగా లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ కుల గణనపై పార్లమెంటులో తీర్మానం చేయించి తీరుతామని శపథం చేశారు. కులం ఏమిటో తెలియని ప్రతిపక్ష నాయకుడు కుల గణన గురించి మాట్లాడుతున్నాడని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాగూర్ తనను ఎద్దేవా చేసినా.. అవమానించినా సరే పీడిత ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతానని సవాల్ విసిరారు. బీజేపీ ప్రభుత్వం ధనికుల ప్రయోజనాల కోసమే బడ్జెట్ రూపొందించిందని పేద మధ్యతరగతి ప్రజలకు మేలు చేయని బడ్జెట్ గా అభి వర్ణించారు. కేంద్రం కుల గణనకు వ్యతిరేకం అయినప్పటికీ రాహుల్ గాంధీ పట్టువదలని విక్రమార్కుడిలా తన పోరాటాన్ని పార్లమెంటులో కొనసాగిస్తున్నారు. అందుకు విరుద్ధంగా తెలంగాణలో రేవంత్ రెడ్డి సామాజిక న్యాయానికి తూట్లు పొడిచే విధంగా అసెంబ్లీ పార్లమెంట్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా మంత్రి పదవిలో చివరికి కార్పొరేషన్ పదవుల్లో సైతం బీసీ ఎస్సీ ఎస్టీలకు మత మైనారిటీలకు మొండి చేయి చూపారు. దేశంలో ఎవరి జనాభా ఎంతో అన్ని రంగాల్లో వారికి అంత వాటా దక్కాలని అందుకు కుల గణన ఒక్కటే శరణ్యమని రాహుల్ గాంధీ దేశమంతా ప్రచారం చేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోనూ కుల గణన చేసి తీరుతామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. అంతేకాకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అసెంబ్లీలో కుల గణన తీర్మానాన్ని చేయించారు. దానికి సంబంధించి జీవో నెంబర్ 26 ను కూడా తెచ్చి బడ్జెట్ కేటాయించారు. కానీ కుల గణన చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం తెలంగాణలో 52 శాతం ఉన్న బీసీలకు కేవలం 23 శాతం వాటాను స్థానిక సంస్థల్లో కల్పించగా 42 శాతం వాటా తప్పకుండా కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు వేయకుండానే నవంబర్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ప్రకటించింది. మరి బీసీలకు వారి వాటా ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఏ రకంగానైతే బీసీలకు అన్యాయం జరిగిందో అదే విధంగా స్థానిక సంస్థల్లో కూడా అన్యాయం జరిగే అవకాశం ఉంది. అందుకే అన్ని బీసీ సంఘాలు కుల గణన జరిగిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని తమ వాటా విద్యా ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి

**కులగణన ఎందుకనే విషయంలో చర్చ జరగాలి**

అసలు కులగణన ఎందుకు అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఏ దేశమైనా ఏ రాష్ట్రమైనా, ఏ ప్రాంతమైనా..ఏ కులమైనా, ఏ జాతి అయినా, ఏ మతమైనా అభివృద్ధి చెందాలంటే దానికి సంబంధించిన పూర్తి సమాచారం లేకుండా అది అభివృద్ధి చెందదు. అలాగే భారతదేశంలో సుమారు 85 శాతం శాతం జనాభా కలిగిన బీసీ ఎస్సీ ఎస్టీ మత మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే వారి జనాభా లెక్కలు సామాజిక, ఆర్థిక, రాజకీయ విద్య ఉద్యోగ సంపద ఇలా అనేక రంగాల్లో వారి వెనుకబాటుతనం ఎంత ఉందో లెక్కలు లేకుండా దేశ అభివృద్ధిలో వారి వాటా ఎంతో తేల్చలేము. అందుకే బ్రిటిష్ వాళ్లు 250 సంవత్సరాలు భారతదేశాన్ని పరిపాలించడానికి ప్రధాన కారణం వారి దగ్గర పూర్తి సమాచారాన్ని కలిగి ఉండడమే. 1871 నుండి 1931 వరకు వారి దగ్గర కులాలపరంగా జనాభా లెక్కలు ఉన్నాయి. అలాగే మతం, వర్ణం ఆధారంగా కూడా లెక్కలను బ్రిటిష్ వాళ్ళ సేకరించారు. అందుకే భారతదేశాన్ని సుదీర్ఘకాలంగా పరిపాలించగలిగారు 1947లో స్వతంత్రానంతరం జనాభా లెక్కలు భారత ప్రభుత్వం చేపడుతున్నప్పటికీ అవి కులాలపరంగా లేవు. కేవలం ఎస్సీ ఎస్టీల కులాలు మాత్రమే లెక్కిస్తున్న కారణంగా మిగతా కులాల జనాభా లెక్కలు భారత్ ప్రభుత్వం వద్ద 2011 వరకు లేవు. దేశ జనాభాలో సుమారు 50 శాతం జనాభా కలిగిన బీసీలు, మహిళల లెక్కలు లేని కారణంగా వారికి విద్యా ఉద్యోగ రంగాలతోపాటు రాజకీయ రంగంలోనూ సరయిన వాటా దక్కలేదు , 1950 నుండి 1993 వరకు బీసీలకు కేంద్రస్థాయిలో రిజర్వేషన్లు లేవు, వివిధ రాష్ట్రాల్లో బీసీల రిజర్వేషన్లు అమలు అవుతున్నప్పటికీ జాతీయస్థాయి రిజర్వేషన్లు లేని కారణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి వాటా నేటికీ ఏడు శాతం కూడా లేకుండా పోయింది. అలాగే స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు అవుతున్నప్పటికీ ఉన్నత స్థాయి సంస్థల్లో.. ముఖ్యంగా రాజకీయ రంగంలో 33% రిజర్వేషన్లు నేటికీ మహిళలకు అమలు కావడం లేదు. అయితే కులగణన ద్వారా అటు పురుషులకు ఇట్లు స్త్రీలకు వారి వారి కులాల జనాభా ఆధారంగా అన్ని రంగాల్లో వాటా దక్కాలంటే సరయిన సమాచారం అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర లేకుండా అభివృద్ధి పథకాలను అమలు చేయాలంటే తప్పనిసరిగా జనాభా లెక్కల సేకరణ కులాలపరంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. 1950 నుండి 90 వరకు కాకా కమిషన్ నుండి మొదలుకుంటే మండల కమిషన్ వరకు కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసింది. మండల కమిషన్ 40 కి పైగా బీసీల అభివృద్ధి కోసం సూచనలు చేసినప్పటికీ వాటిని వీపీ సింగ్ ప్రభుత్వం వచ్చేవరకు అమలుకు నోచుకోలేదు. ముఖ్యంగా విద్యా ఉద్యోగ రంగాల్లో వీపీ సింగ్ ప్రభుత్వం 27% బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తూ 19 90లో చట్టం చేసింది. సుప్రీంకోర్టు కేసు కారణంగా 1993 నుండి పీవీ నరసింహారావు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేసింది. అయితే దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో మినహాయించి అన్ని రాష్ట్రాల్లో బీసీలకు రిజర్వేషన్ వాటా వారికి దక్కలేదు. కర్ణాటక, తమిళనాడు మహారాష్ట్ర లాంటి దక్షిణాది రాష్ట్రాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు సుప్రీంకోర్టు సీలింగ్ కు విరుద్ధంగా అమలు చేస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 50% లోపే రిజర్వేషన్లు బీసీ ఎస్సీ ఎస్టీ మత మైనార్టీలకు అమలవుతున్నాయి. అయితే 2019 నుండి అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం కల్పించిన కారణంగా దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు విధించిన 50% సీలింగుకు మించి రిజర్వేషన్లు అమలు అవుతున్న కారణంగా మండల కేసు సుప్రీంకోర్టు తీర్పు ను పునర్ పునః సమీక్షించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. అందుకు కులగణన దేశవ్యాప్తంగా చేపడితే ఎవరి జనాభా ఎంత అనేది స్పష్టంగా తేలిపోతుంది. బీహార్ రాష్ట్రంలో కుల గణన తర్వాత సామాజిక ఆర్థిక రాజకీయ ముఖచిత్రం మారి రిజర్వేషన్ల శాతం బీసీలకు, ఇతర వర్గాలకు పెరిగింది. అయితే హైకోర్టు , సుప్రీంకోర్టులు పెరిగిన రిజర్వేషన్ల పై స్టేలు విధిస్తూ జోక్యం చేసుకోవడం దురదృష్టకరం. అందుకే బ్రిటిష్ ప్రభుత్వమే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కంటే ఎంతో మేలు అని భావించాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. ఎందుకంటే ఈ దేశ సంపదను అనుభవించడంలో మూడు శాతం జనాభా కలిగిన బ్రాహ్మణులు 48 శాతం వాటా కలిగి ఉండగా 12% జనాభా కలిగిన ఇతర అగ్రవర్ణాలు 45 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 85 శాతం జనాభా కలిగిన బీసీ ఎస్సీ ఎస్టీ మత మైనార్టీలు కేవలం ఏడు శాతం సంపదలో వాటా కలిగి ఉన్నాయి. విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు ఉన్న కారణంగా వారి జనాభా ఆధారంగా వారికి వాటా లభిస్తుంది కానీ బీసీలకు 1993 వరకు కేంద్ర ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్లు లేని కారణంగా విద్యా ఉద్యోగ రంగాల్లో వారి వాటా నేటికీ 10 శాతం లోపే ఉంది. అంటే జనాభా లెక్కలు లేని కారణంగా ఈ దేశ సంపదలో విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 50 శాతం జనాభా కలిగిన బీసీలు మహిళలు తమ వాటాను పొందలేకపోతున్నారు. మత మైనార్టీలు కూడా తమ జనాభా ఆధారంగా తమ వాటాను లెక్కలు లేని కారణంగా పొందలేకపోతున్నారు. అందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అర్థం చేసుకొని బహుజన ఉద్యమ నేత బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ ఇచ్చిన పిలుపుమేరకు ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా అన్ని రంగాల్లో రావాలి అనే డిమాండ్ ను నేడు రాహుల్ గాంధీ స్వీకరించారు. కుల గణన ద్వారానే జనాభా లెక్కల సేకరణ జరిగి ఏయే రంగాల్లో ఎవరి వాటా ఎంత ఉండాలో ప్రస్తుతం ఎంత ఉందో శాస్త్రీయంగా లెక్కలు సేకరించి వారికి న్యాయం చేసే దిశగా ఆయన న్యాయ యాత్ర కొనసాగింది. ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబం రాహుల్ గాంధీ నేతృత్వంలో పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, ఆత్మ గౌరవం , వారికి అన్ని రంగాల్లో వాటా దక్కాలనే గొప్ప ఆశయం నెరవేరాలంటే కుల గణన జరిగి తీరాల్సిందే. దేశవ్యాప్తంగా రాహుల్ కు 85% జనాభా కలిగిన బహుజనులు అగ్రవర్ణాల పేదలు అందరూ అండగా నిలిచారు. కానీ రేవంత్ రెడ్డి తెలంగాణలో అందుకు విరుద్ధంగా తన రెడ్డి సామాజిక వర్గానికి మాత్రమే మంత్రివర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో.. చివరకు కార్పొరేషన్ ప్రభుత్వ అధికారిక పదవుల్లోనూ పెద్దపీట వేస్తూ తెలంగాణలో 93% జనాభా కలిగిన బీసీ ఎస్సీ ఎస్టీ మత మైనార్టీలకు తీరని ద్రోహం చేస్తున్నారు. సామాజిక న్యాయం అమలుపట్ల రాహుల్ గాంధీకి ఉన్న చిత్తశుద్ధి రేవంత్ రెడ్డికి లేదనడానికి తెలంగాణలో ఆయన పరిపాలనే నిదర్శనం.



- ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్
మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా "ఉస్మానియా
& తెలంగాణ విశ్వ విద్యాలయం,
ఫోన్: 93901 19889

## రోడ్లు సరిగా లేక అవస్థలు పడుతున్న
# హనుమాన్‌నగర్ వాసులు



**విశ్వంభర, మెట్పల్లి :** జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణం హనుమాన్ నగర్ వాసులు రోడ్లు సరిగా లేక గుంతలు పడడంతో వర్షం నీరు ఆగి దోమలకు నిలయంగా మారిందని మున్సి పల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇండ్ల ముందు రోడ్లపై గుంతలు ఏర్పడి పిల్లలను స్కూలుకు తీసుకువెళ్లాలన్నా స్కూల్ నుండి తీసుకురావాలన్న వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని కాలనీవాసులు అంటున్నారు. దోమల వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కాలనీలో కుక్కల బెడద చాలా ఉందని పిల్లలను బయటకు పంపడానికి భయపడవలసిన పరిస్థితి ఉందని తెలిపారు. మురుగునీటి కాలువల సమస్య కాలనీలో ఉందని మునిసిపల్ కమిష నర్‌కు హనుమాన్‌నగర్‌కు చెందిన సుజాత, హరి, విజయ, శారద, యశోద ఫిర్యాదు చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై
# పిచ్చి కూతలు కూస్తే సహించం



**విశ్వంభర, కొందుర్గు :** కొందుర్గు మండల ఆదివాసి కాంగ్రెస్ అధ్యక్షులు జరుపుల శ్రీను నాయక్ బుధవారం మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా షాద్‌నగర్ నియోజకవర్గంలో కొంతమంది బీఆర్ఎస్ గిరిజన నాయకులు అవగాహన లేకుండా అనైతికంగా, ఇష్టానుసారంగా కాంగ్రెస్ ప్రభుత్వంపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన నిరంతరం గిరిజన హక్కుల కోసం పోరాటకు చేసిన వ్యక్తి రంగారెడ్డి జిల్లా చైర్మన్ శ్రీను నాయక్ పైన అసత్యాలను ప్రచారం చేస్తూ మాట్లాడుతున్నారు. మీకు ఉంటే దమ్ము ధైర్యము ఉంటే ఏ తండాల్లో ఏం అభివృద్ధి జరిగిందో పది సంవత్సరాల కాలంలో ఏ తండాకు బీటీ రోడ్లు వేశారో చూపించాలన్నారు. తండాలకు ప్రత్యేక రెవెన్యూ గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని మా నాయకుడు శ్రీను నాయక్ ఎన్నో ఏళ్లుగా పోరాడారని తెలియజేశారు. లంబాడి లకు 10% రిజర్వేషన్ కోసం పోరాటాలు చేసింది మా నాయకుడు శ్రీను నాయక్ అని అన్నారు. జనం కోసం జెండా పట్టని కొంతమంది గిరిజన బీ.ఆర్.ఎస్ నాయకులు ఈరోజు తండాల గురించి మాట్లాడుతుంటే ఆశ్చర్యమేస్తుందన్నారు. 10 సంవత్సరాలు నోరు మూసుకున్న నాయకులు ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వం పైన అవగాహన లేక అరుస్తున్నారని అన్నారు. కారు కూతలు కూసే బిఆర్ఎస్ నాయకులను కొందుర్గు మండలం అయోధ్య పురం గ్రామపంచాయతీలో గల అయోధ్య పూర్, చిల్లంబై పాటిగడ్డ, బుడ్డమార్లు కోపుకుంటా తండా, రామన్నగూడెం తాండలలో పది సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వం, వాళ్ల నాయకుడు అంజయ్య యాదవ్ చేసిన ఘనత వాళ్ల అభివృద్ధి ఏముందో వచ్చి చూపించాలని సవాలు విసిరారు. తాండలను సర్వనాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వంది అన్నారు. మీరు చేసిన అరాచకలను గమనించిన ప్రజలు రెండు దపాల ఎన్నికలలో కర్రు కాల్చి వాత పెట్టిననా కూడ బీఆర్ఎస్ వాళ్ళ బుద్ధి మారలేదని అన్నారు. ఇకనైనా తీరు మారకకుంటే భవిష్యత్తులో ప్రజలు గిరిజన తండాలలో మిమ్మల్ని అడుగుపెట్టనివ్వరని హెచ్చరించారు.



## సీఎం దిష్టిబొమ్మ దహనం

**విశ్వంభర, బాలాపూర్ :** మాజీమంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పీ.సబితమ్మను అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అవమానపరిచినందుకు నిరసనగా బాలాపూర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మీర్పేట్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ ఆర్కాల కామేష్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పే వరకు, నిరంతర నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహిళలను అగౌరపరిచిన ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు కొనసాగదని, మహిళల అగ్రహానికి గురిగాక తప్పదన్నారు. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మునిసిపల్ కార్పోరేషన్ మేయర్, ఫ్లోర్ లీడర్, కార్పోరేటర్లు, కాంటేస్టేడ్ కార్పోరేటర్లు, సభ్యులు, బీఆర్ఎస్ దిండు భూపేష్ గౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వీరు రెడ్డి, విజయలక్ష్మి, లతా, సురభి లత, భరత్ నర్సిరెడ్డి, కార్పొరేటర్ లు బొక్క రాజేందర్ రెడ్డి, ఏనుగు అనిల్ యాదవ్, సిద్దల పెద్ద బీరప్ప, మాధవి, యూత్ ప్రెసిడెంట్ నాగరాజు, యాదగిరి, గోపి యాదవ్, బషీర్, జంగయ్య, మహేందర్, వెంకటేష్, వేముల భాస్కర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఫంక్షన్ హాల్ సామాన్యులకు
# అందుబాటు ధరలో ఉండాలి

**విశ్వంభర, నందిగామ :** ప్రజల యొక్క అవసరాలకు, శుభకార్యాలకు పంక్షన్ హాల్ లు అందుబాటులో ఉండి ఉపయోగపడాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం నందిగామ మండల కేంద్రం అయ్యప్ప టెంపుల్ వద్ద సాయిరాం కన్వెన్షన్ హాల్ ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పంక్షన్ హాల్ లు సామాన్యులకు అందుబాటు ధరలో ఉండి, ఉత్తమ సేవలందించాలని ఆయన కోరారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ చిన్నా, పెద్ద శుభకార్యాలు పంక్షన్ హాల్ లోనే జరుపుతున్నారని ఆయన అన్నారు. సామాజిక సేవా దృక్పథంతో, యాజమాన్యం వినియోగదారులకు నాణ్యమైన సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## తెచ్చిన నిధులను మళ్లీ మంజూరు చేసినట్టు
# చూపుతున్న రేవంత్ రెడ్డి

### మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోనే తెచ్చిన నిధులను మళ్లీ మంజూరు చేసినట్టు చూపుతున్నారని అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణకు కల్వకుర్తికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయించిన నిధులను తాను కొత్తగా కేటాయిస్తున్నట్టుగా తెలిపారని మా ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి 100 పడకల హాస్పిటల్ కు హరీష్ రావు గతంలో శంకుస్థాపన చేశారని, ఆర్ టీ నెంబర్ 366 జీవో నెంబర్ ప్రకారం 2023 జూన్ 28 న కమీషనర్ వైద్య విధాన పరిషత్ నుండి 25 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. దానికి గాను మూడు ఎకరాల్లో నిర్మించేందుకు సన్నాహాలు కూడా చేశామని తెలిపారు. గత ప్రభుత్వంలోనే కల్వకుర్తి నియోజకవర్గంలో మూడు నేషనల్ రహదారులు ప్రారంభం చేశామని ప్రత్యేకంగా ముఖ్యమంత్రి నియోజక వర్గానికి కేటాయించింది ఏమీ లేదని ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు చేపట్టి జైపాల్ రెడ్డి పేరు పెట్టి కల్వకుర్తికి సాగునీరు అందించి రైతుల ఆశలు నెరవేర్చాలని అన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని మా ప్రభుత్వం 100 కోట్లు కేటాయించి కల్వకుర్తి పట్టణాన్ని అభివృద్ధి చేసిందని అందుకు అన్ని సాక్షాదారాలు మా దగ్గర ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్ కు 5,000 కోట్ల రూపాయలు మంజూరు చేస్తే కల్వకుర్తికి ఆయన కేటాయించింది కేవలం 20 కోట్లు అని నిరాశ వ్యక్తం చేశారు. మా ప్రభుత్వంలోనే తండాలకు బీటీ రోడ్లకు గత ప్రభుత్వంలోనే 150 కోట్లు మంజూరు చేశామని కొత్తగా వచ్చిన నిధులు ఏమీ లేవని ఆయన దుయ్యబట్టారు. కల్వకుర్తి ఇస్తానన్న స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని మహేశ్వరం కు కేటాయించారని ఆమనగల్లు మండలానికి కేవలం 10 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఆమనగల్లో 50 పడకల ఆసుపత్రికి ప్రారంభోత్సవం చేశానని కడ్తాల్, పడకల్, తలకొండపల్లి, షాద్నగర్, మాడుగుల, మాల్, వంటి పట్టణాలకు డబుల్ రోడ్డును నిర్మించామని కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారంటీలు, 13 పథకాలు, 425 హామీలు అమలుచేసి చూపాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ 66 లక్షల మందికి ఉంటే 40 లక్షల రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని మిగతా రైతులకు కూడా రుణమాఫీ చేసి 15 వేల రైతు బంధు కూడా విడుదల చేయాలని అన్నారు. మీరు అధికారికంలోకి వచ్చాక ఒక్క పంట మీద 35 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని దాంట్లో కూడా 1100 కోట్ల అవినీతి జరిగిందని అది ప్రభుత్వానికి కనిపించడం లేదని రైతులకు వరి ధాన్యం మీద 500 రూపాయల బోనస్ ఇస్తానని దానిని కూడా అమలు చేయాలని కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం, ఆసరా పింఛన్లు 4,000 రూపాయలు చేసి చూపాలని జయపాల్ యాదవ్ పేర్కొన్నారు.

# యాచకులకు, వృద్ధులకు అన్నదానం



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గల కిరణ్ ఫ్లెక్స్ ప్రింటింగ్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు మారుతున్న కాలానికి అనుగుణంగా సేవలందించి వారి ప్రశంసలు పొందాలని సూచించారు. వ్యాపారంలో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని, వాటన్నిటిని దాటుకుంటూ 12వ వార్షికోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వ్యాపారంతో పాటు ప్రజా సమస్యలపై జర్నలిస్టుగా కిరణ్ కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సైను కిరణ్ ఫ్లెక్స్ యజమాని శాలువాతో సత్కరించారు. అనంతరం పట్టణ ప్రముఖులు గాదె మాధవరెడ్డి మాట్లాడుతూ ఒత్తిడితో కూడుకున్న జర్నలిజంలో ఉంటూ ఫ్లెక్స్ ప్రింటింగ్లో రాణించడం సాధ్యమైన విషయం కాదని అన్నారు. రానున్న రోజుల్లో వ్యాపారంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వార్షికోత్సవం రోజు వృద్ధులకు, యాచకులకు అన్నదాన కార్యక్రమం చేయడం ఉన్నతమైన ఆలోచన అన్నారు. వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో ఉన్నటువంటి 50 మంది వృద్ధులు, యాచుకులకు భోజనం ప్యాకెట్లతోపాటు వాటర్ బాటిల్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళీ, మీడియా మిత్రులు శ్రీనివాస్, సుధీర్, పండు, జీవన్, మోహన్ ట్రైలర్స్, బాలు, రవి కుమార్, గోపి, వినయ్, రవి, పులి ప్రసాద్, తెనాలి, పవన్, సాయి, శశి, కుమార్ పాల్గొన్నారు.

## గ్రామాలలో పోలీసులు
# పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు



**విశ్వంభర, షాద్ నగర్ :** గ్రామాల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని షాద్ నగర్ సీఐ విజయ్ కుమార్ కోరారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా బుధవారం ఫరూక్ నగర్ మండలంలో షాద్ నగర్ పోలీసులు గ్రామాలపై ప్రత్యేక దృష్టిని సారించారు. గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు, వివిధ వ్యవహారాలు, వ్యాపకాలపై పోలీసు నిఘా పెట్టి రక్షకబటులు దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో షాద్ నగర్ పట్టణ సీఐ పీ. విజయకుమార్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ పెద్దలు, యువత మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శితో కలిసి గ్రామాన్ని సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ రానున్న గ్రామపంచాయతీ తదితర స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో పోలీసులు పూర్తిస్థాయిలో నిగా పెట్టినట్టు సీఐ ఈ సందర్భంగా గ్రామస్తులకు తెలిపారు. గ్రామాలలో వలస కార్మికుల నివాసం, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మత్తు పదార్థాల విషయాలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రమాదాలకు నిలయమైన ప్రాంతాలను గుర్తించారు. సీసీ కెమెరాలు ఆవశ్యకత గురించి గ్రామస్తులకు వివరించారు. నేను సైతం అంటూ స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఇళ్లకు పెట్టుకోవడం, కమ్యూనిటీ కెమెరాలు సమాజం కోసం ఏర్పాటు చేసుకోవడం వల్ల శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగదని అన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలు చెందిన వలస కార్మికులు, ఎందరో గుర్తుతెలియని వారు ఇక్కడ నివాసం ఏర్పరచుకుంటారని వారి నేర చరిత్ర, వారికి సంబంధించిన వివరాలు సేకరించేందుకు వీలుగా ఆధార్ కార్డులను ఇంటి యజమానులు తమ వద్ద పెట్టుకోవాలని పేర్కొన్నారు. కంపెనీలలో పనిచేసే వారి పూర్తి సమాచారం పొందే విధంగా పోలీసు శాఖ. అంతర్రాష్ట్ర కార్మికుల ఫోన్ నెంబర్లను, ఆధార్ కార్డులను సేకరిస్తుం దని సీఐ తెలిపారు. చిన్నపిల్లలకు చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలు అందించే వారిపై నిఘాపెట్టాలని గ్రామస్తులకు సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే ఏ చిన్న సమాచారం ఉన్నా తమకు అందించాలని, వెంటనే అసాంఘిక కార్యకలాపాలను నివారించే విధంగా చూస్తామని సీఐ తెలిపారు. గ్రామంలో బెల్టు షాపుల కట్టడి, అపరిచిత వ్యక్తుల సమాచారం, దొంగతనాల ఆస్కారం ఉన్న వ్యవహారాలపై సీఐ ఆరా తీశారు. శాంతి భద్రతల పరిరక్షణ తమ ధ్యేయమని షాద్ నగర్ పట్టణ సీఐ పీ. విజయకుమార్ స్పష్టం చేశారు. గ్రామాలలో అపరిచిత వ్యక్తుల సమాచారం దొంగతనాలు రోడ్డు ప్రమాదాలు మత్తు పదార్థాల విక్రయం అంతరాష్ట్ర కార్మికుల సమాచారం తదితర అంశాలపై గ్రామస్తులతో మాట్లాడినట్టు సీఐ విజయ్ కుమార్ తెలిపారు. గ్రామస్తుల సహకారంతో ఎలాంటి నేరాలు జరగకుండా అరికడదామని అన్నారు. గ్రామంలో ప్రజలంతా సంఘటితమై పోలీసు శాఖకు ఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉండాలని పోలీసులు కూడా గ్రామస్తులకు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ తేజస్విని, మాజీ ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి శ్రీశైలం, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బద్దుల మల్లయ్య యాదవ్, మాజీ సర్పంచులు అరుంధతి యాదయ్య, సాయి ప్రసాద్, జర్నలిస్ట్ శ్రీశైలం, బుడ్డ నరసింహా, మల్లేష్, శ్రీపతి రెడ్డి, యాదయ్య, మంజుల పాల్గొన్నారు.



## కలెక్టర్ గౌతమ్ పొట్రూని కలిసిన మేయర్ అజయ్ యాదవ్

**విశ్వంభర, మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రూని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బోడుప్పల్ మున్సిపాలిటీ కార్పొరేషన్ లోని ప్రధానమైన సమస్యలపై చర్చించారు. కలెక్టర్ గౌతమ్ పొట్రూ సమస్యలపై సానుకూలంగా స్పందించారు. మేయరుతో పాటు డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మ రెడ్డి, 14వ డివిజన్ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నందిగామ అయ్యప్ప టెంపుల్ వద్ద నూతనంగా నిర్మించిన సాయిరాం కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవ. పూజా కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

– విశ్వంభర, షాద్‌నగర్

## రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి



**విశ్వంభర, షాద్‌నగర్ :** రైలు కింద పడి ఆత్మహత్య చేసుకు న్న సంఘటన మన షాద్ నగర్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. షాద్ నగర్ రైల్వే స్టేషన్ లో బుధవారం ఉదయం ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 25 నుండి 30 సంవత్సరాలు ఉంటుందన్నారు. షాద్ నగర్ రైల్వే స్టేషన్ మాస్టర్ రాహుల్ కుమార్ ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.మల్లేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే కింద ఇచ్చిన 9848909426 నంబర్ కు సంప్రదించాలని కోరారు. మృతి చెందిన యువకుడుపై గ్రే కలర్ రెన్ కోట్, గ్రీన్ కలర్ టీ షర్ట్స్, బ్లూ కలర్ లోయర్ కుడిచేయికి రాగి ఉంగరం ధరించి ఉన్నాడన్నారు. మృత దేహాన్ని షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచడం జరిగిందన్నారు.



## టీజేయూ ఆధ్వర్యంలో చంద్రకళ రెడ్డికి సన్మానం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలోని ఎస్ వీ హెూటల్లో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ఆధ్వర్యంలో నారీ శక్తి అవార్డు గ్రహీత, కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్, టీజేయూ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేయూ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా మాట్లాడుతూ కంది చంద్రకళ రెడ్డికి నారీ శక్తి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్‌గా, టీజేయూ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా వారు చేస్తున్న సేవలు అమోఘం అని కొనియాడారు. వారికి టీజేయూ యాదాద్రి జిల్లా తరుపున శుభాకాంక్షలు తెలిపారు. నారీ శక్తి అవార్డుకి ఎంపిక కావడం అంత మాములు విషయం కాదని నాంచారి పేట గ్రామ ప్రజలు చేసుకున్న అదృష్టం అని అన్నారు. అక్కా అని పిలిస్తే నేను వున్నా అని భరోసా ఇస్తూ ఎంతో మందికి కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా నిత్యావసర వస్తువులు, బియ్యం, నగదును వారికి తోచినంత సాయం అందిస్తూ ప్రజల హృదయాలను చూరగొంటున్న కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి దంపతులు ఆయూ ఆరోగ్యాలతో సంతోషంగా ఉండాలని అన్నారు. నారీ శక్తి అవార్డు గ్రహీత కంది చంద్రకళ రెడ్డి మాట్లాడుతూ టీజేయూ ఆధ్వర్యంలో నాకు ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేసి సన్మానించిన టీజేయూ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబాకి, జిల్లా కమిటి సభ్యులకు, వివిధ మండలాల నుంచి విచ్చేసిన టీజేయూ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి గుర్రాల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లేష్, మహమ్మద్ యూసుఫ్, మొహమ్మద్ రహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవిరెడ్డి సత్తి రెడ్డి, మహేష్, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ లు, ఆలేరు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, గుండాల మండల అధ్యక్షులు నరేష్, తుర్కపల్లి మండల అధ్యక్షులు బురాన్, ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు, మోటకొండూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, రాజాపేట అధ్యక్షులు శ్రీనివాస్, అడ్డగూడూర్ మండల అధ్యక్షులు సుధాకర్, గుండాల మండలం కార్యదర్శి హరికృష్ణ, కార్యవర్గ సభ్యులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌ను సందర్శించిన వ్యవసాయ అధికారిని



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని సహకార బ్యాంకు పీఏసీఎస్ ను మండల వ్యవసాయ అధికారిని ఎస్ సుజాత బుధవారం సందర్శించారు. బ్యాంకులో 2 వ విడత రైతు రుణమాఫీ విషయంపై రైతులతో మాట్లాడడం జరిగింది. అనంతరం రెన్యువల్స్ వేగంగా చేయవలసిందిగా బ్యాంకు సిబ్బందిని ఆదేశించారు. ఫెర్టిలైజర్ షాప్స్ ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు ఫెర్టిలైజర్, ఫెర్టిసైడ్స్ ఖరీదు చేసిన వారికి కొనుగోలు రశీదులు ఇవ్వాలని అన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. వీరి వెంటా ఏఈఓ మనీషా ఉన్నారు.

## టీజేఏసీ వైస్ చైర్మన్‌గా తొంట సత్యనారాయణ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** టిఎన్జీవో (టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ) కేంద్ర కార్యాలయం హైదరాబాద్ లో 23 ఉపాధ్యాయ సంఘాలతో మంగళవారం నూతనంగా ఏర్పడిన టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ గా భువనగిరి మండలం వీరవెల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణని ఎన్నిక చేశారు. ఎన్నికకు సహకరించిన టీజేఏసీ చైర్మన్ మునగాల మణిపాల్ రెడ్డి, సెక్రటరీ జనరల్ పర్వతి సత్యనారాయణ, డిప్యూటీ చైర్మన్ చింతకుంట జగదీష్, సోదర భాగస్వామ్య సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ తొంట సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్సీఎస్టీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ లకు అడ్డంకిగా ఉన్న జీ.ఓ. నెం. 2 లోని అడక్వసీ పదాన్ని తొలగించాలని, ఎస్సీఎస్టీ ఉపాధ్యాయులకు ఉన్నత విద్యకు అవకాశం కల్పించిన జీ.ఓ. నెం. 342 కు అడ్డంకిగా తీసుకుని వచ్చిన మెమో నెం.265 59 రద్దు పరిచి ఎలాంటి షరతులు లేకుండా జి.ఓ. నెం.342 ను యథావిధిగా అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న డి.ఏ.ల మంజూరుతో పాటు, విద్యావాలంటీర్లను నియమించి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ తొంట సత్యనారాయణ కోరారు.

## ఛలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపు మేరకు ఆత్మకూరు(ఎం) ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మందుల పరశురాములు మాదిగ, మండల అధ్యక్షుడు నల్ల మహేష్ మాదిగ ఆధ్వర్యంలో ఏబీసీడీ వర్గీకరణ సాధనకై చలో ఢిల్లీ ఆగస్టు 6న కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది. ఆవిష్కరణ అనంతరం జిల్లా నాయకులు రాంపాక రాములు మాదిగ మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా సుదీర్ఘమైన పోరాటం చేస్తున్నామన్నారు. పాలక ప్రభుత్వాలు పట్టించుకోకుండా మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ వర్గీకరణ అంశాన్ని పక్కన పెడుతున్నారని అన్నారు. గత పది సంవత్సరాల క్రితం మేము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ పార్టీ చెప్పినా 11 సంవత్సరాలు గడిచిన వర్గీకరణపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని మండి పడ్డారు.

# డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు పూర్తి చేయాలి

**బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**



**విశ్వంభర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండలలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని, పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణతో కలిసి ఆర్నకొండ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలన చొప్పదండి ఆర్నకొండలలో డబుల్ బెడ్ రూమ్ లు నిర్మాణం పూర్తి కాక, వినియోగంలోకి రాక వెచ్చించిన 14 కోట్ల రూపాయల ప్రజా ధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారిందన్నారు. చొప్పదండిలో 169 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయిందని గత ఎనిమిది నెలలుగా డబుల్ బెడ్ రూమ్ ల పురోగతి గురించి రివ్యూ చేయడానికి జిల్లా మంత్రికి తీరిక దొరకడం లేదని, కలెక్టర్ కి సమీక్ష చేయడానికి సమయం ఉండక పోవటం శోచనీయమన్నారు. ఒకవైపు వరసగా కురుస్తున్న వర్షాలతో ఇల్లు లేని లబ్ధిదారులు తాటీపత్రీల కింద, కూలిన ఇండ్లలో, గుడిసెలలో నానా అగచాట్లు పడుతూ ఉంటే మరోవైపు సగం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మేకల పాకలుగా పశువుల కొట్టాలుగా మారడం చూసిన చొప్పదండి ప్రజల గుండెలు తరుక్కుపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్నకొండలో నిర్మాణం పూర్తై లబ్ధిదారులకు నంబర్లు కూడా కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కేవలం కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్ ఇప్పించకపోవడం వలన లబ్ధిదారులు అందులో నివాసం ఉండలేకపోతున్నారని అన్నారు. చొప్పదండి గౌరవ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం తక్షణము స్పందించి ఆర్నకొండలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని, చొప్పదండిలో నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుపేద డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ చొప్పదండి పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, జిల్లా కార్యదర్శి చెపురి సత్యనారాయణ, మాజీ అసెంబ్లీ కన్వీనర్ మొగిలి సారయ్య, ప్రధాన కార్యదర్శులు గొల్ల గట్టయ్య, చిల్లా శ్రావణ, భూపాల పట్నం మాజీ ఉపసర్పంచ్ బైరగోని కిట్టుగౌడ్, పాకాల మహేష్, దండే వెంకటేష్, ఎరుకల తిరుపతి గౌడ్, అమరగాని రాజు, దామెర మధుసూదన్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, మ్యాకల రాములు, జక్కుల అంజయ్య, మొగిలి మహేష్, శంకర్, గొల్లపల్లి మునీన్దర్, లబ్ధిదారులు మల్యాల కొండయ్య, జక్కుల పాపయ్య, శ్రీనివాస్ వెంకటవ్వ, రాజవ్వ, కాదాసి శోభ పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలో మాదకద్రవ్యాల రహిత జిల్లాయే లక్ష్యంగా మండల కేంద్రంలో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో సీఐ సురేష్ బుధవారం ఆదర్శ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువతే మన దేశ భవిత లక్ష్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి మత్తులో యువత పడకుండా, జీవిత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో గంజాయి నిర్మూలన కొరకు టెస్ట్ కిట్ ప్రతి పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. మండలంలో గంజాయి రవాణా, సేవిస్తున్న, అమ్ముతున్న వివరాలను టోల్ ఫ్రీ 8712670266 నెంబర్ కు తెలపాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తోడ్పాటు నివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజు, ప్రిన్సిపాల్ కరుణాకర్, పోలీస్ సిబ్బంది రవీందర్ రెడ్డి, శ్రీను, హుస్సేన్, కాశి, గణేష్, అలివేలు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంది

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరం అని, దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువత సొంత అని, మార్పు రావాల్సింది యువత, మార్పు తేవాల్సింది కూడా యువతే అని దురదృష్టవశాత్తు నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను, శక్తిసామర్థ్యాలను కోల్పోయి నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతున్నారనీ గంజాయి డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగం వలన యువశక్తి పెడదారి పడుతున్నదిని, అందుకు యువత వాటికి దూరంగా ఉండాలి అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన డ్రగ్స్, గంజాయి రహిత అవగాహన స్టిక్కర్స్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలని సకల అనర్థాలకు అరాచకాలకు హత్యలకు ప్రేరణగా నిలిచే గంజాయి డ్రగ్స్ వాడకం వంటి మత్తు వ్యసనాలను దూరం చేయకుండా సమాజం బాగుపడదని, గంజాయి, డ్రగ్స్ మారుమూల గ్రామాలకు పట్టణాలకు వ్యాప్తి చెందడం అత్యంత ఆందోళన కలిగించే విషయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్, బడిపిల్లల నుండి వర్సిటీ స్టూడెంట్స్ దాకా రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు ముఖ్యంగా సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఈ మత్తు మహమ్మారికి బానిసలు అవుతున్నారన్నారు. గంజాయి కొనడానికి డబ్బుల్విలేదని కన్నవారినే కడతేర్చిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయని, గంజాయి దొరకడం లేదని, గంజాయికి, డ్రగ్స్ కి బానిసలై మత్తు నుంచి బయటపడలేక ప్రాణాలు తీసుకుంటున్నారనీ మధ్యతరగతి ప్రజానీకమే లక్ష్యంగా పోలీసుల కన్నుగప్పి అంతరపంటగా గంజాయిని సాగుచేయడం దాన్ని యువతరానికి అలవాటు చేసి, ఆతర్వాత మత్తు పదార్థాలకు బానిసలను చేస్తున్నారని తెలిపారు. పక్కా ప్లాన్ ప్రకారం యువకులకు, చిన్నారులకు ఈ మాదక ద్రవ్యాలను అలవాటు చేస్తున్నారని, అక్రమ రవాణా చేస్తున్నారని, భ్రమల్లో తేలియాడించి ఊహల పల్లకీలో ఊరేగించి, రంగుల ప్రపంచం చుట్టూ పరిభ్రమించేలా చేయగల శక్తి మాదక ద్రవ్యాలకుందని యువత నమ్ముతూన్నారాని తెలిపారు. ఈ డ్రగ్స్ అలవాటు పడిన వారికి మానవ ప్రపంచంతో సంబంధాలుండవని మంచి–చెడు విచక్షణ కనిపించదని. స్వప్నలోకాల్లో విహరిస్తూ, మత్తు వదలిన తర్వాత అనేక శారీరక, మానసిక బలహీనతలకు గురై, మళ్ళీ అదే మత్తుకోసం చేయకూడని అకృత్యాలన్నీ చేస్తారని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. డ్రగ్స్ మాఫియా వలలో చిక్కి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి, చట్టవిరుద్ధమైన డ్రగ్స్ రవాణాకు పాల్పడతారని, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నా, డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేస్తుందని తెలిపారు. యువత సైతం అక్రమ రవాణాను అడ్డుకోవాలనీ ప్రజా–చైతన్య కార్యక్రమాలు చేపట్టాలనీ, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సమాజం అందరూ కలిసి కట్టుగా పోరు సాగిస్తే మాదక ద్రవ్యాలు మహమ్మారిని తరిమివేయడం సాధ్యం అవుతుందని అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సామాజిక సంఘాల వారు అందరికీ కౌన్సిలింగ్ లు నిర్వహించాలని, విద్యాసంస్థల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలని, విద్యాసంస్థల దగ్గర ఉండే చిన్న చిన్నదుకాణదారులకు సైతం డ్రగ్స్, గంజాయి అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బస్తీలల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి అని మత్తుతో అరాచక శక్తులుగా మారుతున్న ఈ పరిస్థితులు మారాలనీ, ప్రజల్లో మార్పు రావాలనీ మత్తులో తూలుతున్న యువతను ఆ మత్తు నుండి బయటకు తీసుకురావాలని అన్నారు. సకల అనర్థాలకు, సమాజంలో చోటుచేసుకుంటున్న అరాచకాలకు, అమానుషత్వ ధోరణులకు “మత్తు” ప్రధాన కారణం అని అనేక సర్వేలు సూచిస్తున్నాయని. మానసిక ప్రవర్తనలో విపరీతమైన ధోరణులను ప్రేరేపించి, అరాచకత్వానికి నాంది పలుకుతున్న డ్రగ్స్ ను యువత నుండి దూరం చేయాలని, డ్రగ్స్ లేని సమాజాన్ని రూపొందించడానికి మరింత కృషి చేయాలనీ డ్రగ్స్, గంజాయి నిర్మూలనకై, వివేకవంతమైన సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ నడుంబిగించాలని కోరారు. ఖండాంతరాలకు విస్తరించిన డ్రగ్స్ దందాను అరికట్టాలనీ ,నగరాలను దాటి, పల్లెల్లోకి ప్రవేశించిన గంజాయి, డ్రగ్స్ మహ మ్మారిని కూకటివ్రేళ్ళతో పెకిలించాలనీ. సమాజంలో ఈ రుగ్మతలను పారద్రోలేందుకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) బాధ్యత తీసుకుని 30,000 అవగాహన గోడ స్టిక్కర్స్ ముద్రించి బాధ్యత తీసుకోవ టం అభినందనీయం అని, మత్తులేని సమాజాన్ని నిర్మించే ఈకృషిలో డీవైఎఫ్ఐ మంచి పాత్ర పోషించాలి అని అందులో అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాళంగి హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు డీ. వీరభద్రమ్, నాయకులు నాగకృష్ణ, పగడాల అనిల్ పాల్గొన్నారు.






## ఆగస్టు 2న సచివాలయం ముందు సర్పంచుల నిరసన దీక్ష

**విశ్వంభర, కడ్తాల్ :** తెలంగాణ గ్రామ పంచాయతీలలో పెండింగ్ లో ఉన్న బిల్లుల విషయమై తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ఎన్ని వినతులు చేసినా ప్రభుత్వం నుండి చలనం లేదని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2019 నండి 2024 కాలవ్యవధిలో సర్పంచులుగా కొనసాగి రాష్ట్ర వ్యాప్తంగా సొంత గ్రామ పంచాయతీ పరిదులలో అప్పటి ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, గ్రామపంచాయతీలలో వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాలువల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం, మనఊరు - మనబడి, పల్లెప్రగతి, మిషన్ భగీరథ లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టి తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంలో మా వంతు కృషి చేయడం జరిగిందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పును ప్రవేశపెట్టి ప్రజలతో, గ్రామపంచాయతీ సిబ్బందితో మమేకమై గ్రామాలను ఆరోగ్యవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడం జరిగిందని సంఘం అధ్యక్షుడు తెలియజేసారు. అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నుంచి సరైన సమయంలో నిధులు అందకపోయినా సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయాలి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే క్రమంలో సొంత డబ్బులు ఖర్చు పెట్టామని మా పాలకమండలి గడువు ముగిసి ఆరు నెలలు కావోస్తున్నాగాని ఇప్పటికీ మా పెండింగ్ బిల్లులు అందక 12,769 గ్రామపంచాయతీ సర్పంచులు అప్పులు చేసి ఖర్చుపెట్టిన పెండింగ్ బిల్లులు చెల్లింపులో జాప్యం వహిస్తున్న ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆగస్టు 2 వ తేదీన ఉదయం 10 గంటలకు తెలంగాణ రాష్ట్ర సచివాలయం ముందు గాంధేయ మార్గంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని సర్పంచు సోదర, సోదరీమణులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

## ఆగస్టు 15తో ముగియనున్న రైతు బీమా గడువు




**ఫరూక్ నగర్ :** 2024 -25 సంవత్సరానికి రైతు బీమా పథకానికి ఎవరైతే 1965 ఆగస్టు 14 నుండి 2006 ఆగస్టు 14 మధ్యలో పుట్టి 59 సంవత్సరాలు లోపు ఉన్నన రైతులు రైతు బీమా అప్లై చేసుకోవాలని ఫరూక్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. రైతు బీమా పథకానికి కావలసిన పత్రాలు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, పట్టాదారు ఆధార్ కార్డ్, నామిని ఆధార్ కార్డ్ తీసుకువచ్చి రైతు స్వయాన ఏఈఓ దగ్గరకు వచ్చి సంబంధిత పారాలు అందజేసి తగిన ధ్రువ పత్రాలు ఇచ్చి సంతకం చేసి అప్లై చేసుకోవాలని తెలిపారు. రైతు బీమా గడువు 2024 ఆగస్టు 5 న ముగియనున్నది కాబట్టి రైతులందరూ అప్లై చేసుకోగలరని తెలిపారు. కొత్త పట్టాదార్ పాస్ బుక్ పొందిన రైతులు, ఇంతవరకు రైతు బీమా నమోదు చేసుకోలేని రైతులు మాత్రమే ఫరూక్ నగర్ మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగలరుని తెలిపారు.

## విద్యార్థులకు బ్యాక్ కిట్లను అందించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, కూకట్‌పల్లి :** బాలాజీనగర్ డివిజన్ రాజీవ్ గాంధీనగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బ్యాగ్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగ్ కిట్లను మా సొంత ఖర్చులతో అందించడం సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఖాజా, అబ్దుల్ అజీజ్, ఎం.కె. నరేష్ , స్కూల్ హెడ్ మాస్టర్ తదితరులు పాల్గున్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్



**విశ్వంభర, కూకట్‌పల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయా కాలనీలో సీసీ రోడ్ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత లోపాలు లేకుండా, రోడ్డుపై ఎత్తు పల్లాలు ఏర్పడకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్ అలీ మున్నా, ఫారూఖ్, రాజిరెడ్డి, లక్ష్మణకుమార్, శ్రీనివాస్ రావు, నాగేశ్వరరావు, రమేష్, వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**విశ్వంభర, బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్‌లో 40 లక్షల రూపాయల వ్యయంతో రూపొందించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ గుర్రాల రమ వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి పథంలో బోడుప్పల్ ను తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతామని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ ముద్దం రామచందర్ అధ్యక్షులు, శివ గౌడ్, తోట నరసింహా, భాస్కర్, నరసింహ, జైపాల్ రెడ్డి, యాదగిరి, ప్రసాద్, తోట కృష్ణ, గుర్రాల రాము, ప్రదీప్, సాయి యాదవ్ లు పాల్గొన్నారు.

## ఫిష్ మార్కెట్ సముదాయాన్ని తనిఖీ చేసిన చైర్మన్ మెట్టు సాయి కుమార్



**విశ్వంభర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి ఫిష్ మార్కెట్ సముదాయాన్ని బుధవారం తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడున్న అవకతవకలు పరిశీలించారు. సమగ్ర విచారణ జరిపి, అర్హులైన మత్స్యకార సొసైటీ సభ్యులకు ఫిష్ స్టాల్స్ కేటాయించాలని, అనహార్హులను గుర్తించి వెంటనే తొలగించాలని డీఎఫ్ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యం శ్రీరంగం, నాగిరెడ్డి, సుభాష్ రెడ్డి, తూము వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలోని ఉపాధి హామీ కూలీలకు గుడ్ న్యూస్

- రాష్ట్రానికి కేంద్రం అదనంగా 6.50 కోట్ల పనిదినాలు కేటాయింపు
- వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధి హామీ కూలీలకు శుభవార్త తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం అదనంగా 6.50 కోట్ల పనిదినాలు కేటయించినట్లు పవన్ పవన్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అదనంగా 6.50 కోట్ల పనిదినాలు కేటాయించింది. ఇదిలా ఉంటే ఇప్పటికే కేటాయించిన 15 కోట్ల పనిదినాలు జూన్ నెలాఖరుకే పూర్తయ్యాయి. అయితే అదనపు అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో మరో 6.50 కోట్ల పనిదినాలకు ఆమోదం తెలిపినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. దీంతో ఉపాధి హామీ కూలీలకు మరిన్ని ఎక్కువ రోజులు ఉపాధి లభించనుంది. పెరిగిన పని దినాల వల్ల ఉపాధి హామీ పథకంలో పని చేసే 54 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. ఇదిలా ఉంటే మొదట మంజూరు చేసిన 15 కోట్ల పని దినాలు జూన్ నెలాఖరుకే పూర్తికాగా, అదనపు పని దినాల కోసం ప్రతిపాదనలు పంపగా, ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను అంగీకరించారని పవన్ చెప్పుకొచ్చారు. అదే విధంగా ఇప్పటి వరకు ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సి బకాయిలను సత్వరమే విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లు కేంద్ర ప్రభుత్వం సమ్మతించినట్లు పవన్ తెలిపారు. ఇందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా.. అటవీశాఖ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని పవన్ హెచ్చరించారు. పల్నాడు జిల్లా విజయపురి సౌత్‌రేంజ్ అటవీ పరిధిలో వన్యప్రాణులను అక్రమ రవాణా చేసే ముఠాను అదుపులోకి తీసుకునే క్రమంలో అటవీశాఖ ఉద్యోగులపై జరిగిన దాడిని ఆయన ఖండిరచారు. ఈ విషయానికి సంబంధించి ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# ఓజోన్ ఆసుపత్రిలో అంతర్జాతీయ వైద్య సేవలు

### గుండె, మెదడు సంబంధిత వ్యాధులకు మెరుగైన వైద్యం




**విశ్వంభర, ఎల్‌బీనగర్ :** పల్లె ప్రజల నుండి పట్టణాల వరకు మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో ఓజోన్ ఆసుపత్రి వైద్య బృందం అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలకు కేంద్రంగా కొత్తపేటలోని ఓజోన్ ఆసుపత్రిని తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. నల్గొండలో ఓజోన్ ఆసుపత్రి వైద్య బృందం హృద్రోగ (గుండె), మెదడు సంబంధిత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సు కార్డియాక్, న్యూరో డిపార్ట్మెంట్లో పేరు ప్రఖ్యాతలు గాంచిన వారి వైద్య బృందంచే నిర్వహించబడింది. ఈ సదస్సులో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న డాక్టర్ సంజీవరావు గుండె శాస్త్ర చికిత్స వైద్య నిపుణులు పాల్గొన్నారు. గడిచిన 25 సంవత్సరాల కాలంలో 88 వేలకు పైగా ఆపరేషన్లు డాక్టర్ సంజీవరావు చేశారు. కొన్ని ఆపరేషన్లు ఇండియాలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, హైదరాబాదులో ప్రథమంగా చేసిన ఆపరేషన్లు ఎన్నో ఉన్నాయి. చేసినటు వంటి చికిత్సలు వేలాదిమందికి ప్రాణభిక్ష పెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైపీ రాజు, డాక్టర్ శిరీష్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వైవి రాజశేఖర్ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ కృష్ణమాచారి, జనరల్ ఫిజీషియన్ మాతృ, ఫిజీషియన్ సాయి శ్రీనివాస్, న్యూరో ఫిజీషియన్ రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

- ప్రభుత్వ పాఠశాలలలో పారిశుధ్య కార్మికులను నియమించాలి
- బీహెచ్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఫీజు నియం త్రణ చట్టాన్ని అమలు చేయాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మిం చాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఈ రోజు అసెంబ్లీలో సంక్షేమ హాస్టళ్ల దయనీయ పరిస్థితులను ప్రస్తావించారు. 1974 లో కట్టిన ఐలాపూర్ హాస్టల్ పేచ్చులూడి స్టీలు రాడ్లు తేలి స్లాబ్ కూలడానికి సిద్ధంగా ఉందని, అదే హాస్టల్ లో ఉంటున్న పేద వర్గాలు దళిత బిడ్డలు బిక్కు బిక్కు మంటూ ఉంటున్నారని, ఇది బంగారు తెలంగాణా నా! తుప్పు పట్టిన తెలంగాణా నా? అని అసెంబ్లీ సాక్షిగా రాకేష్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్కూళ్ళలో కూడా బాత్ రూమ్ లు సరిగా లేవు. స్కూళ్ళలో క్లాస్ రూమ్ లు ఊడ్చే వాళ్ళు లేరు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. స్కూళ్లలో తరగతి గదులను, బడి ఆవరణను శుభ్రం చేసుకోవడం విద్యార్థులు పంతుల్ల వంతవుతుంది. పాఠశాలల పారిశుధ్యం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు అప్పగిస్తూ ఉత్తర్వులు ఐతే ఇచ్చారు. కానీ ఇప్పటికే తగిన సిబ్బంది కొరతతో ఈ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పాఠశాలల దిక్కు చూడడం లేదు. దీంతో పాఠశాలలలో పారిశుధ్యం పడకేసిందని ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని వెంటనే స్కావేంజర్లను (పారిశుధ్య కార్మికులను) నియమించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతుందని ఇంజమూరి రఘునందన్ అన్నారు.




మీకు కావాల్సినవాళ్లు/మీ భర్తో/ మీ కూతురో మీ మెసేజ్ కు రిప్లై ఇస్తున్నారని అనుకుంటున్నారా? కానీ అవతలి వ్యక్తి మృత్యువు నోట్లో తలపెట్టి మీకు రిప్లై ఇస్తున్నారని గమనించారా? ఎవరైనా డ్రైవింగ్ చేస్తూ మెసేజులు చేస్తే లేదా కాల్స్ మాట్లాడితే మందలించండి. వారి కోసం ఒక కుటుంబం ఎదురుచూస్తుందని హెచ్చరించండి.

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

### కర్నె ప్రభాకర్



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త, ఉద్యమకారుడు పేర రమేష్ తల్లి ధనమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పాల్గొన్నారు. దుఃఖంలో ఉన్న కార్యకర్త కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని అన్ని విధాల తాను అండగా ఉంటానని వారికి కర్నె ప్రభాకర్ ధైర్యం చెప్పారు. వారితోపాటు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాచకొండ రవి, గ్రామశాఖ అధ్యక్షుడు తెలంగాణ భిక్షం, నాయకులు పాశం కృష్ణ, కొండ గిరి గౌడ్, బీఆర్ఎస్ వై మండల మాజీ అధ్యక్షుడు రాచకొండ గిరి, ఉప్పల శ్రీను, లింగస్వామి పాల్గొన్నారు.



## వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు

**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్‌పల్లి బస్ డిపోలో వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు జోడిలకు ప్రోత్సాహక బహుమతులను డిపో మేనేజర్ హరి అందజేశారు. పదిమంది కండక్టర్లకు పదిమంది మెకానిక్ లకు ప్రశంసా పత్రాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంచార్జ్ శ్రీలత, ఎం.ఎఫ్ రాజ్యలక్ష్మి, బీ రాజిరెడ్డి, బీ లింగయ్య, ఏం రాఘవయ్య, ఎం శైలజ, జె రుద్రరాజు, జీ రమాదేవి, ఉద్యోగులు ఉన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, కూకట్‌పల్లి :** శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలో వైద్య చికిత్స కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 55 మంది లబ్ధిదారులకు బుధవారం సీఎంఆర్ ఎఫ్ ద్వారా మంజూరైన 18 లక్షల రూపాయల ఎల్ ఓ సీ చెక్కులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నివాసంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్ రెడ్డి, నాయినేనీ చంద్రకాంత్ రావు, జనార్దన్ రెడ్డి, మంత్రిప్రగడ సత్యనారాయణ, పోతుల రాజేందర్, గుమ్మడి శ్రీనివాస్, పితాని శ్రీనివాస్, అనిల్ కావూరి, దుర్గారావు, అంకారావు, పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

**విశ్వంభర, కూకట్‌పల్లి :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన హైదర్ నగర్ కు చెందిన యువకుడు చందుకి బుధవారం బీ.ఎన్.బీ.వై ట్రస్ట్ చైర్మన్ వీరు యాదవ్ పరామర్శించారు. అతని శస్త్ర చికిత్స అవసరమైన ఆర్థిక సాయం ముందుకు వచ్చారు. అవసరమైన ఆర్థిక సహాయాన్ని చందుకు అందజేశారు. వైద్యం అనంతరం కోలికోవాలని ఆశించారు.

## నాటు సారా తయారి వస్తువులు అమ్మకూడదు

### ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్



**విశ్వంభర, ఆమనగల్లు :** అమనగల్లు మండల ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వ్యాపారస్తులు, కిరాణ షాపుల నిర్వాహకులతో సీఐ బద్యానాథ్ చౌహాన్ చౌహాన్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని సారా రహిత రాష్ట్రంగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వ నిబంధనల మేరకు నాటు సారా అరికట్టడంలో భాగంగా బుధవారం అమనగల్లు ఎక్సైజ్ కార్యాల యంలో వ్యాపారస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నాటు సారా తయారి వస్తువులు బెల్లం, పట్టిక, ఇప్పపువ్వు, తదితర వస్తువులు విక్రయిం చినా, వాటిని నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారస్తులకు, కిరాణ షాపులకు, సంఘం సభ్యులకు వివరించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు సారా తయారికి సంబంధించిన వస్తువులు సరఫరా చేయవద్దని ఆదేశించారు. ఈసమావేశంలో కిరాణా షాపుల నిర్వాహకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ క్షమాపణలు చెప్పాలి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** అసెంబ్లీ వేదికగా తెలంగాణ ఆడపడుచు, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు వెంటనే క్షమాపణ చెప్పాలని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ డిమాండ్ చేశారు. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి వాక్యలను నిరసిస్తూ ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలల ప్రభుత్వ పాలనలో జరుగుతున్న హత్యలు, మానభంగాలు, సమస్యలపై మాట్లాడితే సబితా ఇంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ అవమానించడం దారుణం అన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ బీ ఫామ్ పై గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని పార్టీ మారింది అనే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు. బీఆర్ఎస్ బీఫామ్ పై గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న వారిని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పీఠంలో కూర్చోవడానికి మహిళలే ప్రధాన కారణమని, అలాంటి మహిళలని విమర్శిం చడం, బాధపెట్టడం తగదన్నారు. వెంటనే తెలంగాణ మహిళా సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గౌడుగు శ్రీనివాస్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, మంత్రి రవీందర్రావు, కంచర్ల శేఖర్, జగన్మోహన్ రెడ్డి, శ్యామ్ గుప్తా, శ్రీరాములు, జహీర్, మురళీధర్ రెడ్డి నవీన్ గౌడ్ అనురాధ రోజా, జయమ్మ పద్మ పాల్గొన్నారు.

## పనకబండలో పౌరహక్కుల దినోత్సవం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలోని పనుకబండ గ్రామంలో మోత్కూర్ ఆర్.ఐ దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌరహక్కుల దినోత్సవ (సివిల్ రైడ్ డే) కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో దళితుల సమస్యలు తెలుసుకొని వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వనికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వచ్చి వారి వారి సమస్యల పరిస్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై మూడు నెలలకో ఒక్కసారి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే రివ్యూ పూర్తిగా జరపడం లేదని తద్వారా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారని అన్నారు. పలు మండలాల్లో ప్రభుత్వ అధికారులు దళితులపై ఉద్దేశం పూర్వకంగా వివక్ష చూపుతు మాట్లాడుతున్నారని, సివిల్ రైడ్స్ డే కార్యక్రమాలకు హాజరు కావడం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్, గ్రామస్తులు నాగార్జున, భూపాల్, లోతుకుంట అనిల్, లోతుకుంట లచ్చయ్య, వడ్డేపల్లి యాదగిరి, గంధమల్ల కిష్టయ్య, వడ్డేపల్లి స్వామి, వడ్డేపల్లి పరశురాములు, లోతుకుంట ఎల్లయ్య, లోతుకుంట దేగయ్య, మల్లయ్య, అంగన్వాడి టీచర్ పీ. రేణుక, నవ్య పాల్గొన్నారు.

## ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సహకరించాలి

### భూ సేకరణ అధికారి శ్రీదేవి



**విశ్వంభర, చింతపల్లి :** ఆర్ విద్యాసాగర్ రావు డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చింతపల్లి, మల్లారెడ్డిపల్లి, నసర్లపల్లి మూడు గ్రామాలతో కలిపి ప్రాజెక్టు నిర్మించడానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టు విస్తీర్ణం 1691 ఎకరాలు కాగా మూడో విడతలో భాగంగా చింతపల్లి గ్రామానికి సంబంధించి 428 ఎకరాల భూ సేకరణకు జిల్లా అధికారులు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భూ సేకరణ అధికారి శ్రీదేవి హాజరై మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణానికి 428 ఎకరాల రైతుల అభిప్రాయాలను సేకరించినట్టు తెలిపారు. వారి అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. 2016లో ఇస్తామన్నా 5.15లక్షలు చెల్లించని రైతులకు మూడో విడతలో రైతులకు కేటాయించిన 12.50 నిధుల ప్రకారం చెల్లించాలని అధికారులకు రైతులకు తెలిపారు. ఇంటి స్థలం, ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రైతులు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ యాదన్ కుమార్, డీఈ సతీష్ కుమార్, భూ సేకరణ కార్యాలయ సిబ్బంది, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేతగాక అసెంబ్లీలో అడ్డదిడ్డంగా మాటలా..

- కోర్టు తీర్పు తదుపరి అసెంబ్లీలో విప్ అడ్లూరి వ్యాఖ్యలు అభ్యంతకరం
- దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**విశ్వంభర, కరీంనగర్ :** అభివృద్ధి చేతగాక ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అన్న భయంతో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అసెంబ్లీ వేదికగా అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ దళితబంధు పథకానికి సంబంధించి రూపొందించిన గైడ్‌లైన్స్ సరిగా లేవని, ధర్మపురి నియోజకవర్గంలో దళితబంధు పథకాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కేవలం బీఆర్ఎస్ కార్యాకర్తలకు వర్తింపజేశాడని, 2018లో తన కడుపు కొట్టి, కలెక్టర్ సహకారంతో కొప్పుల ఈశ్వర్ గెలిచాడంటూ మాట్లాడటాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఆక్షేపించారు. దేశంలో ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణ అంశాన్ని ఏ న్యాయస్థానం తప్పుపట్టలేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సమయంలో ఏనాడు తాను కౌంటింగ్ హాల్‌లోకి పోలేదన్నారు. లక్ష్మణ్‌కుమార్ 2018లో ఎన్నికల కౌంటింగ్ హాల్‌లోనే ఉండి, ప్రతి ఓటును పరిశీలించుకున్న తదుపరే ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారన్నారు. ఎన్నికల ఫలితాలపై కోర్టులో కేసు వేసి, ప్రజల్లో సానుభూతి పొందాలన్న తప్పుడు రాజకీయం చేసిన వ్యక్తి లక్ష్మణ్‌కుమార్ అంటూ మాజీ మంత్రి విమర్శించారు. రాష్ట్ర హైకోర్టు 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి అవకతవకలు లేవని తీర్పును ఇచ్చిందన్నారు. న్యాయస్థానంలో తీర్పు వచ్చినా, ప్రజల్లో సానుభూతి కోసం తప్పుడు ఆరోపణలు సాగించారన్నారు. గత అసెంబ్లీ కాలం గడిచిపోయి, కొత్త అసెంబ్లీ కాలం నడుస్తుందన్నారు. కోర్టు తీర్పును విస్మరించి, అసెంబ్లీ వేదికగా తప్పుడు ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ధర్మపురి నియోజకవర్గంలో గెలిచేందుకు అడ్డదిడ్డంగా హామీలు గుప్పించిన సానుభూతి మూటగట్టుకొని గెలిచిన లక్ష్మణ్‌కుమార్ 8 నెలల కాలంలో ఒక్క అభివృద్ధి పనిని నియోజకవర్గంలో చేయలేదన్నారు. అభివృద్ధి చేయడం చేతగాక, ఎక్కడ ప్రజలు ప్రశ్నిస్తారో అని, అసెంబ్లీ వేదికగా తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాడన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో దళిత బంధు పథకంను కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రమే వర్తింపజేశామని చెప్పడం శుద్ధతప్పు అన్నారు. నిబంధనల ప్రకారం, దళితులకే పథకాన్ని వర్తింపజేశామన్నారు. దళితబంధు పథకం లబ్దిదారుల్లో కొందరు బీఆర్ఎస్ మద్దతుదారులు ఉంటే ఉండవచ్చు, అలా ఉండటం తప్పా అన్నారు. దళితుల్లో ఎవరూ ధనవంతులు లేరని, వారిలో ఆర్థిక స్వావలంభన సాధించేందుకే దళితబంధు పథకాన్ని తెచ్చామన్న విషయాన్ని లక్ష్మణ్‌కుమార్ యాదికి పెట్టుకోవాలన్నారు. దళితబంధు పథకం తెచ్చి 39 వేల మందికి దళితబంధు ఇచ్చాం, మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత మందికి ఇచ్చిందని మాజీ మంత్రి ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలో రెండవ దఫాలో ఎంపిక చేసిన 1200ల మంది దళితబంధు లబ్దిదారులకు నిధులు ఇప్పించే తెలివిలేని ప్రజాప్రతినిధి అసెంబ్లీ వేదికగా అడ్డదిడ్డంగా మాట్లడటం సరికాదన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళితులకు రూ. 12లక్షలు ఇస్తామంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలి అంటూ ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి, దళిత వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేయాలే తప్పా, వేదికలపై తప్పుడు ఆరోపణలతో యాగి చేయడం సరికాదన్న విషయం తెలుసుకోవాలన్నారు.

## షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి



**విశ్వంభర, కడ్తాల్ :** కర్తాల్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కంబాలపల్లి అంజి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ విషయంలో ఆధార్ కార్డు లింకు, రేషన్ కార్డులో పేరు, అనే లింకులు పెట్టకుండా రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మండల వ్యవసాయ అధికారి పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు క్యామ వెంకటేష్, సిద్దిగారీ వెంకటేష్, కొప్పు కృష్ణ, లచ్య నాయక్, కంబాలపల్లి రాములు, రాజు, బాబ్లు, రైతులు పాల్గొన్నారు.



## అక్రమ పదోన్నతులను రద్దు చేయాలి

**విశ్వంభర, బషీర్ బాగ్ :** హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎస్జీటీ టీచర్లు కూతాడి వనిత, గగులోతు ప్రసాద్ రావులకు పదోన్నతులు కల్పించారని ఎస్జీటీ టీచర్, దివ్యాంగుడు బూర శ్రీనివాస్ ఆరోపించారు. అక్రమంగా ఇచ్చిన పదోన్నతులను ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్ గూడ న్యూస్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోస్టర్ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఇద్దరికి పదోన్నతులు కల్పించరాని అన్నారు. హైకోర్టు పదోన్నతి ఇవ్వాలని ఇచ్చిన ఉత్తర్వులను హైదరాబాద్ డీఈఓ రోహిణి తుంగలో తొక్కారని ఆరోపించారు. న్యాయంగా నాకు రావాల్సిన పదోన్నతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయక, సర్వీస్ నిబంధనలు పాటించకుండా తనకు అన్యాయం చేశారని ఆరోపించారు. దివ్యాంగుడు అయిన తనకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే మిగతా వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నాడు.




## నామినేషన్ దాఖలు చేసిన బూర మల్లేశం

**విశ్వంభర, వనస్థలిపురం:** పద్మశాలి సంఘం రాష్ట్ర ఎన్నికలు ఆగస్టు 18న జరగనున్నాయి. అధ్యక్ష అభ్యర్థిత్వానికి లక్ష్మీ పద్మశాలి టెక్స్ టైల్స్, ఎల్బీనగర్లో బూర మల్లేశం, నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సంఘంలోని ప్రజలందరూ, నాకు మద్దతు ఇచ్చి, గెలిపిస్తారని నేను కోరుకుంటున్నానన్నారు. ఈరోజు నా నామినేషన్ కువచ్చిన జనాభాని చూసి, విజయం సాధించినంతగా, నాకు అనిపించిందన్నారు. ఇదే స్ఫూర్తితో, ఓట్లు పడేంత వరకు ఉంటారని నేను కోరుకుంటున్నానన్నారు. పద్మశాలి సంఘం జరిగే అభివృద్ధి కొరకు రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్, పున్న రాములు, చిలగాని సుదర్శన్, గోపాల్, గోపి, సురేష్, భద్రయ్య, పాల్గొన్నారు.

# మిషన్ పరివర్తన్ అవగాహన

**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలోని స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో బుధవారం డిండి పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి మాదకద్రవ్యాల నిషేదంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ సురేష్, ఎస్సై రాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఒక్కసారి వీటికి బానిస అయితే జీవితంలో కోలుకోవడం చాలా కష్టం అవుతుందని అన్నారు. ఒక్కసారి గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవిస్తే ఆరు నెలల వరకు దీని యొక్క ప్రభావం శరీరంలో ఉంటుందని, ఒకసారి గంజా సేవించి పట్టుబడితే పోలీస్ స్టేషన్లో ఎఫ్ ఐ ఆర్ నమోదు అయ్యి జైలుకు వెళ్తే జీవితంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు అనర్హులు అవుతారని గంజాయి ఎవరైనా తీసుకుంటున్న సమాచారం తెలిసిన, క్రయవిక్రయాలకు సంబంధించిన సమాచారం పోలీస్ వారికి 100 నెంబర్ కు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పైన విద్యార్థులు తమ తల్లిదండ్రులకు బ్యాంకు ఖాతా విషయంలో సరైన విషయ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక, కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి, హోంగార్డులు చందు, కాశి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతి సూదాన్

- కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- వ్యక్తిగత కారణాలతో ఈపదవికి రాజీనామా చేసిన మనోజ్ సోని
- ప్రీతి సూదాన్ ఏపీ క్యాడర్ రిటైర్డ్ ఐఎఎస్



**విశ్వంభర, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిన పరిస్థితుల్లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు కొత్త ఛైర్‌పర్సన్ నియమితులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఎఎస్ అధికారిణి ప్రీతి సూదాన్‌కు యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీతి సూదాన్ ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇది వరకు ఈ హెూదాలో పని చేసిన మనోజ్ సోని తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అత్యంత నమ్మకస్తుడిగా పేరున్న ఆయన.. 2029 మే 15 వరకు పదవీ కాలం ఉన్నప్పటికీ పదవీకాలం ముగియడానికి అయిదు సంవత్సరాలకు ముందే ఈ అత్యున్నత హెూదా నుంచి తప్పుకొన్నారు. స్వచ్ఛందంగా ఆయన వైదొలిగారు. గుజరాత్‌లోని స్వామినారాయణ్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక కేంద్రానికి చెందిన అనూపం మిషన్‌లో నిష్కామ కర్మయోగిగా చేరి.. ఆ కేంద్రానికి శేష జీవితాన్ని అంకితం చేసేందుకు పదవిని వదులుకున్నట్లు గతంలో అధికార వర్గాలు వెల్లడిరచాయి. జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో మనోజ్ సోని తన పదవికి రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రొబేషనరీ ఐఎఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ వ్యవహారం రోజురోజుకూ దుమారం రేపింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్వయానా ఆమెపై కేసు నమోదు చేసింది. సివిల్ సర్వీసెస్ పరీక్షల నుంచి ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేసేలా చర్యలు తీసుకుంది.ఆ పరిస్థితుల్లో మనోజ్ సోనీ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు ఈ వివాదాలకు ఎలాంటి సంబంధం లేదని, వ్యక్తిగత కారణాల వల్ల నెల కిందటే ఆయన వైదొలిగారంటూ అప్పట్లో వార్తలొచ్చాయి. మనోజ్ సోనీ రాజీనామా చేయడం వల్ల ఖాళీ అయిన యూపీఎస్సీ ఛైర్‌పర్సన్ స్థానంలో ప్రీతి సూదాన్ అపాయింట్ అయ్యారు. 1983 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఎఎస్ అధికారిణి ఆమె. 2020 జులైలో రిటైర్డ్ అయ్యారు. రిటైర్ అయ్యే సమయానికి కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్నారు.

# పూజా ఖేద్కర్‌కు భారీ షాక్

- ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దు
- భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్



**న్యూఢిల్లీ:** మహారాష్ట్రకు చెందిన వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై అవినీతి ఆరోపణల వ్యవహారంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) సంచలన నిర్ణయం తీసుకుంది. పూజ ఖేద్కర్ ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసింది. ఈ మేరకు యూపీఎస్సీ అధికారులు తెలిపారు.పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేద్కర్‌పై అధికార దుర్వినియోగంతోపాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది. ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ పూజా ఖేద్కర్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.అయితే, దీనికి పూజ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు యూపీఎస్సీ తాజా ప్రకటనలో వెల్లడించింది. పూజా ఖేద్కర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించగా సివిల్ సర్వీస్‌ఎగ్జామ్2022 నియమాలను ఉల్లంఘించినట్టు తేలిందని వివరించింది. ఫలితంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తప్పుడు గుర్తింపును ఉపయోగించి సివిల్ సర్వీసెస్ పరీక్షలు పరిమితికి మించి రాయడంపై జులై 18న పూజా ఖేద్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జులై 25లోగా దీనిపై సమాధానం చెప్పాలని పూజను ఆదేశించింది. దీనిపై స్పందించిన ఆమె.. ఆగస్టు 4 వరకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలోనే పూజ విజ్ఞప్తిని పరిశీలించిన యూపీఎస్సీ.. జులై 30 మధ్యాహ్నం 3.30 గంటల వరకు అనుమతించింది. అయితే, ఆమెకు జారీ చేసిన షోకాజ్‌నోటీసులపై సమయంలోగా సరైన స్పందన రాకపోవడంతో తాజాగా ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.కాగా, ఇప్పటికే పూజా ఖేద్కర్ వ్యవహారంపై యూపీఎస్సీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. పుణెలో శిక్షణలో ఉండగా పూజా ఖేద్కర్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పూజాపై వచ్చిన ఆరోపణలు అన్నింటిపై యూపీఎస్సీ దర్యాప్తు చేసింది. పూజ తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫోటోలు, సంతకాలు, అడ్రస్, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ మార్చి తప్పుడు గుర్తింపుతో పరిమితికి మించి సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఆమె ప్రొబేషన్‌ను నిలిపివేసి, ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని కూడా ఆదేశించింది. మరోవైపు, 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన పూజా ఖేద్కర్ సివిల్ సర్వీస్ పరీక్ష పాసయ్యేందుకు నకిలీ దివ్యాంగురాలి సర్టిఫికెట్ సమర్పించడమే కాకుండా ఓబీసీ కోటా వాడుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. పోస్టింగ్ సమయంలోనూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2007లో ప్రైవేటు మెడికల్ కళాశాలలో ప్రవేశం కోసం కూడా నకిలీ ఫిట్‌నెట్ సర్టిఫికెట్ సమర్పించినట్లు ఆమెపై ఆరోపణలున్నాయి. పూజ నాన్ క్రీమీలేయర్, వైద్య ధ్రువీకరణలు కూడా వివాదాస్పదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సమగ్ర దర్యాప్తును చేపట్టింది. ఇది ఇలావుంటే, చీటింగ్ ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే ఆమెపై పోలీసులు కేసు నమోదు చేయడంతో.. ముందస్తు బెయిల్ కోసం పూజ ఇటీవల ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. దీనిపై ఆగస్టు 1వ తేదీన కోర్టు తీర్పు వెలువరించనుంది.

# వికసిత్ భారత్ ప్రస్థానంలో ఈ ఐదేండ్లు కీలకం

### నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు ఈ ఐదేండ్ల కాలం అత్యంత కీలకమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాజ్యసభలో బుధవారం 2024-25 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌పై ఆమె మాట్లాడారు. 2014 నుంచి సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఆ దిశగానే ఈ బడ్జెట్‌ను కూడా రూపొందించామని చెప్పారు.బడ్జెట్‌పై విస్తృత చర్చ జరిగిందని, 83 మంది సభ్యులు బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాలుపంచుకున్నారని తెలిపారు. ఈ బడ్జెట్ గతంలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌కు కొనసాగింపేనని చెప్పారు. వృద్ధి, ఉపాధి కల్పన, సంక్షేమం, మూలధన వ్యయం, పెట్టుబడులే ప్రాధాన్యాలుగా బడ్జెట్‌లో ఆయా రంగాలకు పెద్దపీట వేశామని వెల్లడించారు. ఆర్థిక స్థిరీకరణనూ పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. 2025-26 నాటికి ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం దిగువకు తీసుకొస్తామని 2021లో సభలో తాను హామీ ఇచ్చానని ఆ దిశగానే ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఐఎంఎఫ్ గణాంకాల ప్రకారం అంతర్జాతీయ వృద్ధిలో భారత్ వాటా 16 శాతంగా ఉందని, అది మరింత పెరగనుందని ఆమె భరోసా ఇచ్చారు. తయారీ రంగం వృద్ధికి బడ్జెట్‌లో పలు ఊతమిచ్చే చర్యలు చేపట్టామని చెప్పారు. దేశం నుంచి మొబైల్ ఫోన్ల తయారీ భారీగా పెరిగిందని తెలిపారు.







# నువ్వుంటావో, నేనుంటానో తేల్చుకుందాం..

### ఫడ్నవీస్‌కు శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సవాల్

**ముంబై:** అసెంబ్లీ ఎన్నికల తర్వాత 'నువ్వుంటావో, నేనుంటానో తేల్చుకుందాం' అని మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఈ మేరకు ఆయన సవాల్ చేశారు. ఉద్ధవ్ ఠాక్రే, ఆయన కుమారుడు ఆదిత్య ఠాక్రేను జైలుకు పంపేందుకు ఫడ్నవీస్ ప్రయత్నిస్తున్నారని ఎన్సీపీ (ఎస్పీ) నేత అనిల్ దేశ్‌ముఖ్ ఇటీవల ఆరోపించారు. బుధవారం ముంబైలోని రంగశారదా ఆడిటోరియంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఉద్ధవ్ ఠాక్రే దీనిపై స్పందించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు శివసేన (యూబీటీ), బీజేపీ మధ్య వివాదం మరింత తీవ్రమవుతుందని అన్నారు. కాగా, బీజేపీని దొంగల గుంపుగా ఉద్ధవ్ ఠాక్రే అభివర్ణించారు. 'ఇప్పుడు కూడా, పార్టీని వీడాలనుకునే వారు వెళ్లిపోవడాన్ని స్వాగతిస్తా. మాజీ కౌన్సిలర్లు కావాలనుకుంటే వెళ్లిపోవచ్చు. నా శివసైనికులతో కలిసి నేను పోరాడతా. 'నువ్వు ఉంటావా? నేను ఉంటానా?' అన్న సంకల్పంతో పోరాటంలోకి దిగా. తన బంధుమిత్రులంతా ఎదురుగా ఉండడం చూసి అర్జునుడికి బాధ కలగడం సహజమని గీతలో చెప్పారు. నాకు కూడా అదే అనిపించదా? నిన్న మొన్నటి వరకు నాతో ఉన్న వారు ఇప్పు డు నా ఇంటిపై దాడికి వస్తున్నారు. నన్ను, ఆదిత్యను ఎలాగైనా జైలులో పెట్టడానికి ఫడ్నవీస్ పన్నాగం పన్నినట్లు అనిల్ దేశ్‌ముఖ్ నాకు చెప్పారు. వీటన్నింటిని భరిస్తూ గట్టిగా నిలబడ్డా. 'మీరైనా ( ఫడ్నవీస్) ఉండాలి లేదా నేనుండాలి'. ఇప్పటికీ నా దగ్గర అధికారిక పార్టీ, గుర్తు లేదా డబ్బు లేదు. కానీ మీ (శివసైనికుల) బలం మీద మాత్రమే నేను ప్రతి ఒక్కరినీ సవాల్ చేస్తున్నా' అని అన్నారు.మరోవైపు ప్రధాని మోదీకి కూడా చెమటలు పట్టే విధంగా లోక్‌సభ ఎన్నికల్లో పోరాడినట్లు ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలు చివరి పోరాటమని చెప్పారు. 'ఇది మాకు చివరి సవాలు. దీని తరువాత ఎవరూ మాకు సవాలు చేయలేరు. వారు మా పార్టీని, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేశారు. ఇప్పుడు మనకు సవాల్‌గా నిలుస్తున్నారు. శివసేన తు ప్పు పట్టిన కత్తి కాదు. మెరిసే కత్తి. ముంబైని కాపాడుకోవడానికి పోరాడాల్సి వచ్చింది. ఇద్ద రు వ్యాపారవేత్తలు ఇదంతా చేస్తున్నారు. వారి మనస్తత్వాన్ని పూర్తిగా నిర్మూలించాలి' అని అన్నారు.

# పార్లమెంట్‌లో కులాల ప్రస్తావన తీసుకురావడం సరైంది కాదు

- రాహుల్ గాంధీని అవమానించేందుకే అనురాగ్ ఠాకూర్ మాట్లాడారు
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విస్మయం



**ఢిల్లీ:** లోక్‌సభలో కాషాయ నేతలు కులాల ప్రస్తావన తీసుకురావడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విస్మయం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కులంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలు పెనుదుమారం రేపిన క్రమంలో ఈ వ్యవహారంపై ఖర్గే స్పందించారు. పార్లమెంట్‌లో కులాల ప్రస్తావన సరైంది కాదని, రాహుల్ గాంధీని అవమానించేందుకే అనురాగ్ ఠాకూర్ మాట్లాడారని, ఇది సరైంది కాదని చెప్పారు.ఎంతోమంది సీనియర్ బీజేపీ నేతలు కులాంతర వివాహాలు చేసుకున్నారని, ఈ విషయం వారు గుర్తెరగాలని అన్నారు. ముందు మీరు అద్దంలో చూసుకుని ఇతరుల గురించి మాట్లాడాలని కాషాయ నేతలకు ఖర్గే హితవు పలికారు. అనురాగ్ ఠాకూర్ అపరిపక్వతతో మాట్లాడితే దాన్ని ప్రధాని మోదీ ట్వీట్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.పలువురు బీజేపీ నేతలు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నారు..వారు ప్రతిఒక్కరి కులం గురించి అడుగుతారా..? ఇది తప్పని, దీన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాని మోదీ ట్వీట్‌ను కూడా తాను ఖండిస్తున్నానని చెప్పారు. ఎక్కడ మాట్లాడాలి, దేన్ని సమర్థించాలనేది ప్రధాని మోదీ తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ విషయం పక్కనపెట్టి సెంటిమెంట్లను రగిలించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో దీన్ని అనుమతించరాదని ఖర్గే స్పష్టం చేశారు.



## హమాస్ చీఫ్ దారుణ హత్య

**టెహ్రాన్:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో దిగ్భ్రాంతికర సంఘటన చోటు చేసుకుంది. ఇస్లామిక్ రెసిస్టెన్స్ మూమెంట్.. హమాస్ రాజకీయ విభాగం అధినేత ఇస్మాయిల్ హనియా దారుణహత్యకు గురయ్యారు. ఇస్మాయిల్‌తో పాటు ఆయన వ్యక్తిగత అంగరక్షకుడొకరు దుర్మరణం పాలయ్యారు. టెహ్రాన్‌లో అర్ధరాత్రి దాటిన తరువాత ఈ ఉదంతం చోటు చేసుకుంది. ఇస్మాయిల్ బస చేసిన ఓ భవనంపై గుర్తు తెలియని వ్యక్తులు భీకర దాడికి దిగారు. ఈ దాడిలో ఆయనతో పాటు బాడీగార్డ్ మరణించారు. ఈ విషయాన్ని ఇరాన్, హమాస్ సంస్థ ధృవీకరించాయి. ఈ దాడి వెనుక ఇజ్రాయిల్ ప్రమేయం ఉందని ఆరోపించాయి.ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన మసౌద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనడానికి ఇస్మాయిల్.. ఇటీవలే టెహ్రాన్‌కు వచ్చారు. స్థానికంగా హై సెక్యూరిటీ జోన్ ప్రాంతంలో ఉండే ఓ భవనంలో బస ఏర్పాటు చేసింది టెహ్రాన్ ప్రభుత్వం. ఆయనతో పాటు హమాస్ ప్రతినిధులు కొందరు ఇక్కడే ఉంటోన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ భవనంపై కొందరు దాడికి పాల్పడ్డారు. యథేచ్ఛగా కాల్పులు జరిపారు. ఇస్మాయిల్‌ను టార్గెట్‌గా చేసుకుని ఈ దాడులు సాగాయి. ఈ ఘటనలో ఆయనతో పాటు అంగరక్షకుడు మరణించాడు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం, హమాస్, ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నిర్ధారించాయి. ఇస్మాయిల్ నివసిస్తోన్న భవనంపై చోటు చేసుకున్న దాడిలో ఆయనతో పాటు బాడీగార్డ్ వీరమరణం పొందినట్లు ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వెల్లడిరచింది. ఈ దాడి వెనుక గల కారణాలు ఇంకా తెలియరావట్లేదని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని ఐఆర్జీసీ పేర్కొంది.

# వయనాడ్ ఘటనపై రాజకీయాలు తగవు

### : కేసీ వేణుగోపాల్

**ఢిల్లీ:** వయనాడ్ విషాదం దేశాన్ని విస్మయపరిచిందని ఈ వ్యవహారంపై రాజకీయాలు తగవని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వయనాడ్ ఉదంతంపై మాట్లాడిన తీరు సరైంది కాదని చెప్పారు. పాలక పక్ష సభ్యుడి ప్రసంగం విచారకరమని పేర్కొన్నారు. ఇది యావత్ దేశానికి, కేరళకు అత్యంత విషాద ఘటన అయినందున తేజస్వి సూర్యను హెూంమంత్రి అమిత్ షా వారించాల్సిందని అన్నారు. ఈ ఘటనపై మనం అప్రమత్తం కావాలని, దీనిపై చర్యలు అవసరం, సరైన ఫలితాలు రాబట్టడం అవసరమని చెప్పారు. మనం కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేమని, కానీ మనమంతా ఐక్యంగా ఉన్నామని దేశానికి చాటాల్సిన సందర్భం ఇదని వేణుగోపాల్ పేర్కొన్నారు. కాగా, కేరళలో వయనాడ్‌లో మృత్యుఘోష కొనసాగుతోంది. వయనాడ్‌లో విపత్తు నిర్వహణ బృందాలు, సైనికులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.





## ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రైల్వే లైన్


# ప్రకటించిన కేంద్రం

**రేణిగుంట- సీఆర్ఎస్ నగర్ మధ్య కొత్త రైల్వే లైను నిర్మించడానికి కేంద్రం పచ్చజెండా**

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సారథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రధానంగా రైల్వేకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వరాలజల్లు కురిపిస్తోంది. గతంలోనే ఉన్న గుంటూరు-బీబీ నగర్ డబ్లింగ్ ప్రాజెక్టు పనులు ప్రారంభమవగా, రాజధాని అమరావతికి కొత్తగా నిర్మించే అమరావతి-ఎర్రుపాలెం రైల్వే లైనులో కదలిక వచ్చింది. దీనికి సంబంధించిన పనులు పర్యవేక్షించేందుకు అధికారులను కూడా నియమించారు. తర్వాత రేణిగుంట నుంచి సీఆర్ఎస్ నగర్ మధ్య కొత్త రైల్వే లైను నిర్మించడానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. తిరుపతి-రేణిగుంట రద్దీని తగ్గించేందుకు తిరుపతికి సమీపంలోని రేణిగుంట అతి పెద్ద రైల్వే జంక్షన్. రోజురోజుకు రైళ్ల రాకపోకలు తీవ్రంగా పెరుగుతుండటంతో విపరీతమైన రద్దీ నెలకొంది. ప్రస్తుతం ఉన్న రెండు లైన్లు కూడా సరిపోవడంలేదు. అలాగే రైళ్లకు ఏవైనా మరమ్మతులు చేయాలంటే వీటిని సీఆర్ఎస్ కు తీసుకువెళ్లడానికి కూడా కుదరనంత రద్దీ ఉండటంతో కొత్త రైల్వే లైను నిర్మించాలని అధికారులు భావించారు. రేణిగుంట సమీపంలోని సీబీఐడీ కాలనీ దగ్గర గూడ్స్ షెడ్డు ఏర్పాటు చేయనుండటంతో ఈ పనులకు కేంద్రం రూ.25 కోట్లు విడుదల చేసింది. ఈ పనులు పూర్తయితే రైళ్ల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తదు. తిరుమల ఎక్స్ ప్రెస్ రద్దు ఈ లైనుతో పాటు విజయవాడ నుంచి గూడూరు మధ్య మూడోలైను నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో ఆరు రోజులపాటు విశాఖపట్నం నుంచి కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు ఐదో తేదీ నుంచి పదో తేదీ వరకు, కడప నుంచి విశాఖపట్నం మధ్య నడుస్తున్న తిరుమల రైలును ఆగస్టు ఆరో తేదీ నుంచి 11వ తేదీ వరకు రద్దు చేశారు. వీటితోపాటు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్, విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్ ప్రెస్ రైళ్లు విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో ఆగవని అధికారులు ప్రకటించారు.

# నేనే నేరుగా వారితో మాట్లాడుతాను

- కొత్త పరిశ్రమలకు భరోసా కల్పిస్తాం
- కంపెనీలను తిరిగి రప్పించేందుకు గట్టిగా ప్రయత్నించాలి
- రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో కొత్తగా ఇండస్ట్రియల్ క్లసర్లు ఏర్పాటు
- పరిశ్రమల శాఖ అధికారులతో చంద్రబాబు సమీక్ష



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో పారిశ్రామికీకరణ పైన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టారు. రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడుల దిశగా అడుగులు వేస్తున్నారు. పరిశ్రమల శాఖలో గత ఐదేళ్లుగా జరిగిన వ్యవహారాలపై చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. గత అయిదేళ్ల కాలంలో పారిశ్రామిక రంగంలో చోటు చేసుకున్న పరిణామాలు...కొత్త పరిశ్రమలకు భరోసా గురించి చర్చించిన చంద్రబాబు అధికారులతో చర్చించి, దిశా నిర్దేశం చేసారు. టీడీపీ హయాంలో వచ్చిన పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లారని అధికారులు చంద్రబాబుకు వివరించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం సహకరించకపోవడంతో ఇలా జరిగిందని తెలిపారు. భూములు కేటాయించిన తర్వాత కూడా వెనక్కి వెళ్లిపోయారని చెప్పారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు కూడా దుర్వినియోగం అయ్యాయని వారు ముఖ్యమంత్రికి వెల్లడించారు. పారిశ్రామీకరణ దిశగా ఈ క్రమంలోనే కంపెనీలను తిరిగి రప్పించేందుకు గట్టిగా ప్రయత్నించాలని చంద్రబాబు అన్నారు. పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం కల్పించేందుకు తానే మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల్లో భూముల లభ్యత, పారిశ్రామిక అనుకూల ప్రాంతాలపై చర్చలు నిర్వహించారు. కేంద్రం బడ్జెట్ లో ఏపీలో రెండు ఇండస్ట్రియల్ కారిడార్ల గురించి ప్రస్తావన చేసింది. మౌలిక వసతుల గురించి హామీ ఇచ్చింది. దీంతో..ఏపీలో పారిశ్రామిక కారిడార్ల పైన ఈ సమీక్షలో చర్చించారు. అధికారులకు చంద్రబాబు పలు సూచనలు చేసారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అయిదు నూతన పాలసీల రూపకల్పనతో పాటుగా రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో కొత్తగా ఇండస్ట్రియల్ క్లసర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు పెండింగ్ ఏ మేర ఉన్నాయి... కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వచ్చే వారికి ఏ మేర ప్రోత్సాహకాలు ఇవ్వాలనే అంశం పైన చర్చ జరిగింది. రాష్ట్రంలో గతంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చి... వెనుకడుగు వేసిన సంస్థల తోనూ చర్చలు చేసేందుకు ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

# ఏపీ మంత్రివర్గ సమావేశం వాయిదా

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ఆగస్టు 2న ముఖ్యమంత్రి చంద్ర బాబు అధ్యక్షతన జరుగవలసిన సమావేశం వివిధ ప్రభు త్వ కార్యాక్రమాల వల్ల వాయిదా వేశారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉండడంతో సమావేశాన్ని వాయిదా వేసుకు న్నారు. పింఛన్ల పంపిణీని పండుగ వాతావరణంలోఅన్ని నియో జకవర్గాలు, గ్రామాల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా మంత్రులు కూడా పంపిణీలో పాల్గొననున్న దృష్ట్యా ఈ మంత్రి వర్గ సమావేశాన్ని వారం చివరల్లో నిర్వహించను న్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆర్టీసీ బస్సు లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఇళ్ల పంపిణీ తదితర హామీలపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఆయా శాఖల ఉన్నతాధికారులు సమావే శంలో చర్చించాల్సిన అంశాలను, ప్రతిపాదనలను సాధా రణ పరిపాలన శాఖకు అందజేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులకు ఏపీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

## ఏపీలో మరోమారు తగ్గిన బియ్యం, కందిపప్పు ధరలు!!


- నేటి నుంచి రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏపీలో మండిపోతున్న నిత్యవసర వస్తువుల ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తుంది. ఏపీలోని సామాన్య ప్రజలకు మరోమారు ధరలను తగ్గించి నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తున్నట్టు ప్రకటించింది. మళ్ళీ బియ్యం, కందిపప్పు ధరలను తగ్గించిన ఏపీ ప్రభుత్వం ఇందులో భాగంగా ఇంతకు ముందు పౌరసరఫరాల శాఖ పైన సమీక్ష నిర్వహించిన మంత్రి నాదెండ్ల మనోహర్ ఏపీలో బహిరంగ మార్కెట్లో కందిపప్పు, బియ్యం ధరలు మండిపోతుండగా ప్రభుత్వం తరఫున రెండు వస్తువులను తగ్గించిన ధరలపై పంపిణీ చేయాలని నిర్ణయించి రాయితీ కందిపప్పు, బియ్యం రైతు బజార్లలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక తాజాగా మరోమారు నిత్యావసర వస్తువులైన బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం ధరలను మరోసారి తగ్గించాలని ఎపి ప్రభుత్వం నిర్ణయించింది. రైతు బజార్లలో కందిపప్పు కిలో 160రూపాయల నుంచి 150 రూపాయలకు, బియ్యం 48 రూపాయల నుంచి 47 రూపాయలకు స్టీమ్ బియ్యం 49 రూపాయల నుంచి 48 రూపాయలకు తగ్గించడంతో తగ్గించిన ధరలతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి గురువారం నుంచి విక్రయిస్తారని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీనికి కావలసిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లకు ఆదేశించానని ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ లో షేర్ చేశారు. నెల రోజుల్లో రెండు సార్లు కందిపప్పు, బియ్యం ధరల తగ్గింపు రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నెల రోజులలో బియ్యం, కందిపప్పు ధరలను రెండుసార్లు తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. కందిపప్పు బియ్యం ధరలు బహిరంగ మార్కెట్లో 181 రూపాయలు పలుకుతుండగా, బహిరంగ మార్కెట్లో కిలో స్టీమ్డ్ బియ్యం 55 రూపాయలకు విక్రయిస్తున్నారు. తగ్గించిన ధరలతో సామాన్య ప్రజలకు మేలు జరగనుంది.

## ప్రజలకు మేలు చేయాలనుకుంటే అసెంబ్లీకి రండి

**జగన్‌కు మంత్రి కొలుసు పార్థసారథి హితవు**



**విశ్వంభర, మంగళగిరి :** ప్రజలకు మేలు చేయాలని అనుకుంటే అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలని మంత్రి పార్థసారథి సూచించారు. వైసీపీ చేసిన అక్రమాలు ఆధారాలతో నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి కొలుసు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీకి డబ్బులు చెల్లించలేదని అబద్ధ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్లులు చెల్లించకపోవడంతో గతంలో అనేక ఆస్పత్రులు ఆరోగ్యశ్రీని నిలిపివేశాయని గుర్తుచేశారు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ పథకంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. మీరు చేసిన మేలు ఏమైనా ఉంటే ప్రజలకు వివరించాలని మంత్రి కొలుసు పార్థసారథి సవాలు విసిరారు. పేదలకు వైద్యం అందకుండా చేసిన చేతగాని పాలన జగన్‌ది అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పరిస్థితి మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కోటిమందికి పథకం అమలు చేస్తామని చెప్పారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

## పరిశ్రమల స్థాపనకు క్యూకడుతున్నారు

- ఏపీ పారిశ్రామిక విధానానికి ఆకర్షితులవుతున్న పారిశ్రామిక వేత్తలు
- రూ.75 వేల కోట్ల రూపాయల వ్యయం కాగల బీపీసీఎల్ ఇండస్ట్రీ ఏపీకి రాబోతోంది
- దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక విధానాన్ని తీసుకొస్తాం
- ఏపీ మంత్రి టీజీ భరత్



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే ఉత్తమ పారిశ్రామక విధానాన్ని తీసుకురానున్నామని ఏపీ మంత్రి భరత్ వెల్లడించారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014-19 వరకు చంద్రబాబు హయాంలో ఏపీలో పారిశ్రామిక విధానానికికి ఆకర్షితులైన అనేక మంది పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చారని వివరించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేండ్లలో పరిశ్రమల ఏర్పాట్లకు ఫ్రెండ్లీ వాతావరణం కల్పించలేకపోయారని ఆరోపించారు. గతంలో పెట్టుబడులకు పారిశ్రామకవేత్తలు భయపడే పరిస్థితి ఉండేదని ఆరోపించారు. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఇండస్ట్రీయల్ పాలసీ, ఎంఎస్ఎంఈ , క్లస్టర్ పాలసీని 45 రోజుల్లో తీసుకురానున్నామని తెలిపారు. ఏపీలో సహజ సిద్ధమైన వనరులున్నాయని, వాటిని వినియోగించుకుని ముందుకు వెళ్తామని వివరించారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో భూముల ధరల తగ్గింపుపై చర్చ జరిగిందన్నారు. ప్రస్తుతం ఓర్వకల్లు, కృష్ణపట్నం, ఏపీ బల్క్‌డ్రగ్ పార్క్, కడప జిల్ల కొప్పర్తిలో క్లస్టర్లున్నాయని తెలిపారు. కొత్తగా కుప్పం, లేపాక్షి, శ్రీకాకుళం జిల్లా మొల్లపేట, ప్రకాశం జిల్లా దోనకొండలో పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. సుమారు 75 వేల కోట్ల రూపాయల వ్యయం కాగల బీపీసీఎల్ ఇండస్ట్రీ ఏపీకి రాబోతుందని వివరించారు.



## మచిలీపట్నంకు మహర్దశ!!

**మంగినపూడి తీరాన్ని సందర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర**

**విశ్వంభర, మచిలీపట్నం :** ఏపీలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటకం పైన కూడా దృష్టి సారిస్తుంది. రాష్ట్రంలో పర్యాటక పరంగా అభివృద్ధి చెయ్యాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తుంది. ఈ క్రమంలోనే మచిలీపట్నం వాసులకు శుభవార్త చెప్పింది. దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు పోటీగా మంగినపూడి బీచ్ అభివృద్ధి చేస్తామని చెప్పింది. మంగినపూడి తీరాన్ని సందర్శించిన మంత్రి బందరుకు మణిహారంలా నిలిచే మంగినపూడి తీరాన్ని జగన్ ప్రభుత్వ హయాంలో నాశనం చేశారని, మళ్ళీ ఈ బీచ్‌కు పునర్వైభవం తెస్తామని, దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు పోటీగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ అథారిటీ ప్రతినిధి కిరణ్ తో కలిసి మంగినపూడి బీచ్ సందర్శించారు. ఐదేళ్ళ జగన్ పాలనలో పర్యాటకం నిల్ మంగినపూడి బీచ్ లో కలయదిరిగిన మంత్రి వసతులు, రక్షణ చర్యలు గురించి అక్కడకు వచ్చిన పర్యాటకులను అడిగి తెలుసుకున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీచ్ లో అనేక అభివృద్ధి పనులు చేశామని, తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ పనుల్ని పడకేయించారని మండిపడ్డారు. అభివృద్ధి పనులు చేయకపోగా ఉన్న పనుల్ని కూడా నాశనం చేశారని నిప్పులు చెరిగారు. ఐదేళ్ల జగన్ పాలనలో పర్యాటకాన్ని పడకేయించారని అసహనం వ్యక్తం చేశారు. తీర ప్రాంతంలో జగన్ కాలపు విధ్వంసం మట్టి అమ్ముకుని బీచ్ పరిసరాలను నాశనం చేశారని ఆయన విమర్శలు గుప్పించారు. తీర ప్రాంతంలో విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు . కూటమి అధికారంలోకి వచ్చాక మంగినపూడి బీచ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం అన్నారు. త్వరలోనే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో బీచ్ పరిసరాల్లో సదుపాయాలు కల్పిస్తామని కొల్లు రవీంద్ర అన్నారు. అవసమైన మేరకు హెూటల్స్, రిసార్ట్స్, బీచ్ డెవలప్మెంట్ కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆయన స్పష్టం చేశారు. భద్రతతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రబాబు సర్కార్ ప్రజల ఆహ్లాదం కోసం పర్యాటకాన్ని కూడా అభివృద్ధి చేసే పనిలో ఉందని ఆయన వెల్లడించారు. అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ అథారిటీతో కలిసి వసతులు కల్పిస్తామన్నారు.

# మాజీ ముఖ్యమంత్రిలో మార్పు

- కేడర్ కోసం సమయం కేటాయింపు
- ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని జగన్ హామీ



**విశ్వంభర, తాడేపల్లి :** మాజీ ముఖ్యమంత్రి జగన్ లో మార్పు కనిపిస్తోంది. ఎన్నికల్లో పరాజయం తరువాత పొరపాట్లను సరిదిద్దుకొనే ప్రయత్నం మొదలైంది. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజలు, పార్టీ కేడర్ తో కలిసి ప్రయాణం చేసిన జగన్ 2019లో ముఖ్యమంత్రి అయ్యారు. సీఎం అయిన తరువాత ప్రజలకు..పార్టీ కేడర్ కు దూరమయ్యారు. ఎమ్మెల్యేలు సైతం సీఎం ను కలవలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఫలితాల తరువాత తిరిగి సాధారణ ప్రజలు..పార్టీ కేడర్ కు జగన్ అందుబాటులోకి వచ్చారు. ముఖ్యమంత్రిగా జగన్ ఉన్న సమయంలో సాధారణ ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజాదర్బార్ నిర్వహించాలనే ప్రతిపాదన పలు మార్లు ప్రస్తావనకు వచ్చింది. వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో ప్రతీ రోజు ఉదయం క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించే వారు. అదే తరహాలో జగన్ కొనసాగించాలని పార్టీలో పలువురు సీనియర్లు సూచించారు. కానీ, అమలు కాలేదు. అదే విధంగా వైఎస్సార్ తన పాలన ..పథకాల పైన ప్రజల్లోకి వెళ్లేందుకు రచ్చబండకు నిర్ణయించారు. ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తేనే హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. కేడర్ కోసం సమయం జగన్ తాను అమలు చేసిన సంక్షేమ పథకాల పైన ప్రజల నుంచే ఫీడ్ బ్యాక్ తీసుకొనేందుకు రచ్చబండ నిర్వహిస్తానని అంతర్గత చర్చల్లో పేర్కొన్నారు. అయిదేళ్ల కాలంలో ఒక్కసారి రచ్చబండ నిర్వహించ లేదు. ఇక.. ఎమ్మెల్యేలు సైతం క్యాంపు కార్యాలయానికి వెళ్లినా సీఎంతో నేరుగా కలవాలంటే కష్టతరమైందని పలువురు ఫలితాల తరువాత చెబుతూ వస్తున్నారు. సీఎంగా మీడియా సమావేశాలు నిర్వహించని జగన్ ఇప్పుడు ఈ నెలన్నార కాలంలో అయిదు సార్లు మీడియా సమావేశాలు నిర్వహించారు. ఇంటర్వ్యూలు ఇస్తున్నారు.

**ప్రజలతో మమేకం..**

తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో జగన్ ప్రజలు, పార్టీ కేడర్, అభిమానులను కలిసేందుకు బుధవారం సమయం కేటాయించారు. పలువురు తాడేపల్లిలో జగన్ నివాసానికి చేరుకున్నారు. వారిని జగన్ పలకరించారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని జగన్ హామీ ఇచ్చారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దు, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతీ కార్యకర్తకు తనతో పాటు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని వైయస్ జగన్ గారు భరోసానిచ్చారు.

# సత్తాచాటిన భారత బాక్సర్ లౌవ్లీనా

## ఇంకోటి గెలిస్తే పతకం ఖాయం..!

**విశ్వంభర (స్పోర్ట్స్) :** పారిస్ ఒలింపిక్స్‌లో భారత బాక్సర్ లౌవ్లీనా బొర్గొహైన్ సత్తా చాటింది. నాలుగేండ్ల క్రితం కాంస్యంతో మెరిసిన ఆమె ఈసారి కూడా పతక వేటలో ముందంజ వేసింది. తన పంచ్ పవర్‌కు తిరుగులేదని చాటుతూ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన 75 కిలోల విభాగం బౌట్‌లో లౌవ్లీనా చెలరేగింది. ఏకపక్ష పోరులో నార్వేకు చెందిన సున్నివా హెఫ్‌స్తాద్‌ను చిత్తుగా ఓడించింది. విశ్వ క్రీడల్లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన లౌవ్లీనా తొలి రౌండ్ నుంచి ప్రత్యర్థిపై విరుచుకుపడింది. ఆమె ధాటికి సున్నివా బిత్తరపోయింది. దాంతో, 5 పాయింట్లు సాధించిన లౌవ్లీనాను అంపైర్లు విజేతగా ప్రకటించారు. తద్వారా ఈ ఈశాన్య బాక్సర్ పతకానికి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో లీ కియాన్ (చైనా)తో లౌవ్లీనా తలపడనుంది. ఈ బౌట్‌లో విజయం సాధించి సెమీస్ చేరితో పతకం ఖాయమైనట్టే. టోక్యో ఒలింపిక్స్‌లో 69వ విభాగంలో పోటీ పడిన లౌవ్లీనా కంచు మోత మోగించిన విషయం తెలిసిందే. మరోవైపు భారీ అంచనాలతో పారిస్‌కు వచ్చిన సీనియర్ బాక్సర్ అంతిమ్ పంగల్, జాస్మినే లంబోరియా, ప్రీతిలు నిరాశపరిచారు.




# ఐసిసి టెస్టు ర్యాంకుల ప్రకటన

- బ్యాటింగ్ లో రూట్, బౌలింగ్ లో అశ్విన్, ఆల్‌రౌండర్లలో రవీంద్ర జడేజాలకు అగ్రస్థానం
- రూట్ మళ్లీ నంబర్ 1.. హిట్‌మ్యాన్ సిక్సర్




**విశ్వంభర (స్పోర్ట్స్) :** ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ మళ్లీ టెస్టుల్లో వరల్డ్ నంబర్ 1 ర్యాంకు సాధించాడు. ఈ మధ్యే సుదీర్ఘ ఫార్మాట్‌లో 32వ సెంచరీతో పాటు 12వేల పరుగుల క్లబ్‌లో చేరిన, విండీస్‌పై మూడు టెస్టుల సిరీస్‌లో 291 రన్స్ బాదిన రూట్ అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. ఐసీసీ తాజాగా టెస్టు బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండ్ ర్యాంక్‌లను ప్రకటించింది.గ రూట్ నంబర్ 1 ర్యాంకు సొంతం చేసుకోగా.. న్యూజిలాండ్ మాజీ సారథి కేన్ విలియమ్సన్ రెండో స్థానానికి పడిపోయాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజాం మూడో ర్యాంక్‌కు పరిమితమయ్యాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఆరో స్థానానికి ఎగబాకాడు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా టాప్‌లో కొనసాగుతున్నాడు.

### మూడో ర్యాంక్‌లో బుమ్రా

టెస్టు బౌలర్ల జాబితాలో భారత బౌలర్లు టాప్ లో నిలిచారు. సీనియర్ ఆఫ్ స్పిన్నర్ల రవి చంద్రన్ అశ్విన్ టాప్ ర్యాంక్ నిలబెట్టుకోగా యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఆసీస్ స్పీడ్‌స్టర్ జోష్ హేజిల్‌వుడ్ రెండో ప్లేస్‌లో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న జడేజా బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానం సాధించాడు. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా రాణించిన విండీస్ యువ పేసర్ జైడెన్ సీల్స్ 27వ ర్యాంక్‌కు ఎగబాకాడు.




## ప్రీ క్వార్టర్స్‌లోకి పీవీ సింధు


**పారిస్:** పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో పీవీ సింధు బ్యాడ్మింటన్ ప్రీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. చాలా ఈజీగా ఆమె మ్యాచ్‌ను ముగించింది. వరల్డ్ ర్యాంక్ 73 ఉన్న క్రిస్టిన్ కూబాపై 21-5, 21-10 స్కోరుతో రెండవ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో విజయం సాధించింది. ప్రీ క్వార్టర్స్‌లో ఆరవ సీడ్ హీ బిన్‌జావో తో సింధు తలపడనున్నది.టోక్యో ఒలింపిక్స్‌లో బ్రాంజ్ మెడల్ గెలిచిన పీవీ సింధు.. పారిస్‌లోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. తొలి గేమ్‌తో పాటు రెండవ గేమ్‌లోనూ దూకుడుగా ఆడింది. 33 నిమిషాల్లోనే ఆమె ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి మ్యాచ్‌లో 21-9, 21-6 స్కోరుతో ఫాతిమా అబ్దుల్ రజాక్‌పై 29 ఏళ్ల సింధు విజయం సాధించింది. తొలి గేమ్‌ను సింధు కేవలం 14 నిమిషాల్లో సొంతం చేసుకున్నది. రెండవ గేమ్‌లో కూబా కొంత ఫైట్ ఇచ్చింది.

## సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన

# హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో యువతని క్రీడల వైపు ప్రోత్సహించే విధంగా, ఉత్తమ క్రీడాకారులను తీర్చిద్దిదే క్రమంలో భాగంగా ముచ్చెర్ల లో స్పోర్ట్స్ హబ్, అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం నిర్మాణంకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గారు ప్రకటించడం హర్షణీయమని హెచ్ సి ఏ అధ్యక్షుడు అరిశనపల్లి జగన్ మోహన్ రావు అన్నారు.ఇటీవల హెచ్ సి ఏ చేసిన విజ్ఞప్తిని గౌరవించి 100 ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ మైదానాన్ని నిర్మిస్తామని, జిల్లాలలో క్రికెట్ మైదానాలను నిర్మిస్తామని తెలిపినందుకు రాష్ట్రంలోని క్రికెట్ అభిమానుల తరపున ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి అరిశనపల్లి జగన్ మోహన్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# లక్ష్యసేన్ సంచలన విజయం..

## ప్రీక్వార్టర్స్‌లోకి ఎంట్రీ

**పారిస్:** బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్యసేన్ సంచలన విజయం నమోదు చేశాడు. పారిస్ ఒలింపిక్స్‌లో ప్రీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో.. ప్రపంచ మూడవ ర్యాంక్ ప్లేయర్ జొనాథన్ క్రిస్టీపై 21-18, 21-12 స్కోరు తేడాతో సేన్ విజయం సాధించాడు. తొలి గేమ్‌లో 2-8 తేడాతో వెనుకబడి ఉన్న సేన్.. ఆ తర్వాత అనూహ్యంగా తేరుకున్నాడు. ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చి ఆ గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్ స్టార్టింగ్‌లో ఇద్దరి మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగింది. ఇండోనేషియాకు చెందిన జొనాథన్ ఆధిక్యం కోసం ప్రయత్నిం చినా.. సేన్ దూకుడుగా ఆడాడు. ఇంగ్లండ్, ఆసియా చాంపియన్ క్రిస్టీని ఓడించేందుకు లక్ష్యసేన్ పట్టుదలను ప్రదర్శించాడు. అయితే ప్రీ క్వార్టర్స్ లో హెచ్ ప్రణయ్‌తో సేన్ తలపడే అవకాశాలు ఉన్నాయి.

## నాలుగో రోజు లాభాల్లో

# ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**విశ్వంభర (బిజినెస్) :** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలు మార్కెట్లకు దన్నుగా నిలిచాయి. బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్లను పెంచగా.. అమెరికా ఫెడ్ నిర్ణయాలు నేటి రాత్రి వెలువడనున్న విషయం తెలిసిందే. పలురంగాల్లోని షేర్ల కొనుగోళ్ల మద్దతు మార్కెట్లు లాభాల బాటలో నడిచాయి. అలాగే, తొలిసారిగా మార్కెట్లు రికార్డు స్థాయి గరిష్ఠాల వద్ద ముగియడం విశేషం. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,655.90 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత అదే ఊపును కొనసాగిస్తూ చివరలో సెన్సెక్స్ 81,828.04 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరగా 285.95 పాయింట్ల లాభంతో 81,741.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ట్రేడింగ్‌లో పాయింట్ల 24,984.60 గరిష్ఠాన్ని నమోదు చేసింది. ముగింపులో 93.85 లాభంతో 24,951.15 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1828 షేర్లు పురోగమించగా.. 1,613 షేర్లు పతనమయ్యాయి. మరో 78 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, బీపీసీఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్ లాభాల్లో ముగిశాయి. బ్రిటానియా ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టాటా కన్స్యూమర్, రిలయన్స్ ఇండస్ట్రీస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నష్టాల్లో ముగిశాయి. రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ మినహా మీడియా, పవర్, హెల్త్‌కేర్, మెటల్, ఫార్మా ఒక్కొక్కటి ఒక్కోశాతం పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ దాదాపు 0.63శాతం పెరగ్గా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ స్వల్పంగా పతనమైంది.



# పన్ను చెల్లింపుదారులు కొత్త విధానంవైపే మొగ్గు

- ఆరు కోట్ల ఐటీఆర్‌లు దాఖలు..
- 70శాతం కొత్త పన్ను విధానంలోనే నమోదు
- రెవెన్యూశాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా వెల్లడి




**విశ్వంభర, బిజినెస్ :** 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ఆదాయం కోసం దాదాపు ఆరుకోట్ల ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలయ్యాయి. ఇందులో 70శాతం కొత్త పన్ను విధానంలోనే నమోదైనట్లుగా రెవెన్యూశాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు కొత్త విధానంవైపే మొగ్గు చూపినట్లుగా తెలిపారు. సరళీకృత కొత్త పన్ను విధానాన్ని ప్రజలు అవలంబిస్తారా? లేదా? అనే భయాలు ఉన్నాయని.. ఇప్పుడు దీనికి ఎలాంటి ఆందోళన లేదన్నారు. బడ్జెట్లో ప్రకటించిన సమగ్ర ఆదాయపు పన్ను సమీక్ష వెనుక ఉన్న ఆలోచన పన్ను చట్టాన్ని సరళతరం చేయడమేనని ఆయన అన్నారు. ముసాయిదాను తయారు చేసి సలహాలు తీసుకుంటామన్నారు. సరళీకరణ దిశగా అడుగు వేశామని పేర్కొన్నారు. దీని అంతిమ లక్ష్యం పన్ను సమ్మతి భారాన్ని తగ్గించడమేనన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 8.61 కోట్ల ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. ప్రస్తుతం దేశంలో రెండు వ్యక్తిగత ఆదాయ పన్ను విధానాలు అమలులో ఉన్నాయి. పాత ఆదాయపు పన్ను విధానంలో.. పన్ను రేట్లు ఎక్కువగానే ఉంటాయి. కానీ, పన్ను చెల్లింపుదారులు అనేక మినహాయింపులను, తగ్గింపులను క్లెయిమ్ చేసుకునే వీలుంటుంది. అయితే, కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు తక్కువగా ఉంటాయి. ఇందులో తగ్గింపులు కూడా తక్కువగా ఉంటాయి.

# జీవిత, వైద్య బీమా పథకాలపై జీఎస్టీ తొలగించాలి

## నిర్మలా సీతారామన్‌కు నితిన్ గడ్కరీ లేఖ

**విశ్వంభర బిజినెస్ :** లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై చెల్లించే జీఎస్టీ ని తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. నాగ్‌పూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నుంచి వచ్చిన మెమోరాండం ప్రకారం లేఖ రాస్తున్నట్లు గడ్కరీ తెలిపారు.కుటుంబానికి కొంత రక్షణ కల్పించడానికి, ప్రమాదాల సమయంలో వ్యక్తికి సహాయంగా నిలిచే ప్రీమియంలపై పన్నును యూనియన్ వ్యతిరేకిస్తోందని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రీమియంలపై 18% జీఎస్టీ అనేది సమంజసం కాదన్నారు. ఇదొక సామాజిక అవసరం అని.. కాబట్టి జీవిత, వైద్య బీమా పథకాల ప్రీమియంలపై పన్ను ఉపసంహరించుకోవాలని కోరారు.'యూనియన్ లేవనెత్తిన ప్రధాన సమస్య లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరణకు సంబంధించినది. ఈ రెండింటిపై 18 శాతం పన్ను ఉంది. జీవిత బీమా ప్రీమియంపై జిఎస్టీ విధించడం అనేది అనిశ్చితిపై పన్ను విధించడం కిందకే వస్తుంది. కుటుంబానికి కొంత రక్షణ కల్పించడానికి తీసుకునే జీవిత బీమాపై పన్ను విధించకూడదని యూనియన్ భావిస్తోంది. అదేవిధంగా, వైద్య బీమా ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ అనేది సమంజసం కాదు. సామాజికంగా అవసరమైన ఈ విభాగం వ్యాపార వృద్ధికి అడ్డంకిగా మారుతోంది. అందుకే వీటిపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని యూనియన్ కోరుతోంది' అని నితిన్ గడ్కరీ తన లేఖలో వివరించారు.



## ఎనర్జీ రంగంలోని

# ఇన్వెస్టర్ల దృష్టి

### ఈ రంగంలోని స్టాక్స్ కి లాభాలు

**విశ్వంభర (బిజినెస్):** ఎనర్జీ రంగంలోని షేర్లపై చాలా కాలంగా దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్ల దృష్టి కొనసాగుతోంది. దేశం లో జరుగుతున్న అభివృద్ధికి తోడుగా గృహ వినియోగం పెరగటం, ఈవీ వాహనాలవైపు ప్రభుత్వం ప్రజలను మళ్లించే ప్రయత్నం వంటి కారణాలు విద్యుత్ డిమాండ్ పెంచుతోంది. దీనికి తోడు ఇతర కారణాలతో ఈ రంగంలోని స్టాక్స్ సూపర్ లాభాలను చూస్తున్నాయి.ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది టోరెంట్ పవర్ కంపెనీ షేర్ల గురించే. టొరెంట్ గ్రూప్ కంపెనీ ఏప్రిల్-జూన్ త్రైమాసిక కాలానికి బలమైన లాభాలు ప్రకటించటంతో పవర్ షేర్లలో తుఫాను పెరుగుదల నమోదైంది. ఫలితాలతో కంపెనీ షేర్లు బుధవారం ఇంట్రాడేలో ఏకంగా 18 శాతం లాభపడ్డాయి. ఈ క్రమంలో ఒక్కో షేరు ధర రూ.1,899 స్థాయికి చేరి సరికొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేశాయి.ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది టోరెంట్ పవర్ కంపెనీ షేర్ల గురించే. టొరెంట్ గ్రూప్ కంపెనీ ఏప్రిల్-జూన్ త్రైమాసిక కాలానికి బలమైన లాభాలు ప్రకటించటంతో పవర్ షేర్లలో తుఫాను పెరుగుదల నమోదైంది. ఫలితాలతో కంపెనీ షేర్లు నేడు ఇంట్రాడేలో ఏకంగా 18 శాతం లాభపడ్డాయి. ఈ క్రమంలో ఒక్కో షేరు ధర రూ.1,899 స్థాయికి చేరి సరికొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేశాయి.

# బీసీసీఐ దెబ్బకు దిగొచ్చిన బైజూస్..

## కానీ, ఎదురైన కొత్త సమస్య..




**విశ్వంభర, బిజినెస్ :** గడచిన ఏడాది నుంచి బీసీసీఐ- ఎడ్‌టెక్ స్టార్టప్ బైజూస్ మధ్య బకాయి చెల్లింపులకు సంబంధించిన ఒక వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఒప్పందం లేనప్పటికీ చెల్లింపుల్లో కొంత భాగాన్ని ఆపటంపై బీసీసీఐ దివాలా ప్రక్రియ కోసం కోర్టుకు వెళ్లింది. దీంతో వివాదానికి పరిష్కారానికి బైజూస్ ముందుకు రాక తప్పలేదు.వివరాల్లోకి వెళితే.. తమకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో బైజూస్‌తో ఒక సెటిల్‌మెంట్‌కు చేరుకున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) నేడు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్‌కి తెలియజేసింది. వాస్తవానికి ఈ మొత్తాన్ని రాబట్టేందుకే స్టార్టప్ కంపెనీని దివాలా ప్రక్రియ కోసం బీసీసీఐ కోర్టుకు లాగింది. ప్రస్తుతం ఒప్పుకున్న పరిష్కారంలో భాగంగా.. బైజు రవీంద్రన్ సోదరుడు రిజు రవీంద్రన్ నిన్న రూ.50 కోట్లు తమకు చెల్లించినట్లు బీసీసీఐ చెన్నై బ్రాంచ్‌కి తెలిపింది. రేపు మరో రూ.25 కోట్లు, మిగిలిన రూ.83 కోట్లను ఆగస్టు 8లోగా చెల్లించనున్నట్లు తెలిపింది.అయితే ప్రస్తుతం బకాయిల చెల్లింపులపై కూడా వివాదం మొదలైంది. యూఎస్ ఆధారిత ఆర్థిక రుణదాత బైజూస్ బకాయిలను తిరిగి చెల్లించడాన్ని వ్యతిరేకించింది. అలాగే ఆర్థిక ఇబ్బందుల మధ్య బైజూ రవీంద్రన్ దుబాయ్‌కి పారిపోయాడని వాదనల్లో కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం బైజూల్ చేస్తున్న డబ్బు 553 మిలియన్ డాలర్లలో భాగమని చెప్పారు. దీనిపై స్పందించిన బీసీసీఐ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే క్రికెట్ బోర్డు కళంకిత డబ్బును ఎప్పటికీ అంగీకరించదని చెప్పారు. బీసీసీఐ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా రుణదాతల ఆందోళనలు ఊహలపై ఆధారపడి ఉన్నాయని అన్నారు. BCCI కి చెల్లిస్తున్న డబ్బు బైజూ రవీంద్రన్‌ది కాదని అండర్‌టేకింగ్‌ను ఫైల్ చేసేలా బైజూస్‌ను ఆదేశించాలని రుణదాతలు NCLATని కోరారు.

## పూరితో నేను పోల్చుకోలేను



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న 'పుష్ప 2' ఏ ముహూర్తాన వాయిదా పడిందో కానీ అప్పటినుంచి ఆ డేట్ కోసం టాలీవుడ్‌తో బాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలు క్యూ కట్టిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ పుష్ప ఆగష్టు 15న విడుదల చేస్తామని ప్రకటించి ఆ తర్వాత డిసెంబర్ 06వ తేదీకి వాయిదా వేశారు. అయితే పుష్ప పక్కకి తప్పుకోవడంతో ఆ ప్లేస్‌లోకి రామ్ పోతినేని డబుల్ ఇస్మార్ట్ వచ్చి చేరింది. అయితే ఈ సినిమా సోలోగా విడుదల అవుతుంది ఈ ఇండిపెండెన్స్‌కి అని అంతా అనుకున్నారు. కానీ ఎటునుంచి వచ్చిందో తెలిదు. వైల్డ్ కార్డ్‌లా ఎంట్రీ ఇచ్చింది రవితేజ మిస్టర్ బచ్చన్. ఈ సినిమా కూడా ఆగష్టు 15న బరిలోకి దిగబోతున్నట్లు ప్రకటించింది. అయితే ఈ క్రమంలోనే తమిళం నుంచి తంగలాన్ కూడా వస్తుంది. దీంతో ఈ మూడు సినిమాలు బాక్సాఫీస్ వద్ద క్లాష్ అవ్వబోతున్నట్లు సినీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అయితే తమిళం నుంచి వస్తున్న తంగలాన్ తెలుగులో ఎఫెక్ట్ చూపకపోయిన డబుల్ ఇస్మార్ట్ – మిస్టర్ బచ్చన్ రెండు ఢీకొట్టే అవకాశముంది. అయితే డబుల్ ఇస్మార్ట్ టీమ్.. బచ్చన్ టీమ్‌ను కలిసి మూవీని వాయిదా వేసుకోమని అడిగినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనికి బచ్చన్ టీం ఒప్పుకోకపోవడంతో నిర్మాత చార్మీ రవితేజతో పాటు మిస్టర్ బచ్చన్ దర్శకుడు హరీశ్ శంకర్‌ను సోషల్ మీడియాలో బ్లాక్ చేసినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై చిత్రబృందం కూడా స్పందించలేదు. అయితే రీసెంట్‌గా మిస్టర్ బచ్చన్ ప్రమోషన్స్‌లో పాల్గోన్న హరీశ్ శంకర్ తాజాగా ఇస్మార్ట్ టీంతో ఉన్న వివాదంపై స్పందించాడు. పూరి జగన్నాథ్ సినిమాతో పాటు మీ సినిమా ఒకేసారి విడుదల కాబోతుంది దీనిపై మీ అభిప్రాయం ఏంటి అని రిపోర్టర్ అడుగగా.. పూరితో నేను పోల్చుకోలేను. ఆయన ఒక దిగ్గజం. ఆయనతో నా సినిమా వస్తుండటం నా అదృష్టం. నిజానికి రెండు సినిమాలు ఒకే డేట్‌కి రావడం వెనుక ముఖ్య కారణం ఓటీటీ ఇష్యూ ఉండడం అందుకే ముందుగా రిలీజ్ చేస్తున్నా.. అంతేకాని నాకు పూరి సర్‌కి ఎలాంటి గొడవలు లేవు. అంటూ హరీశ్ శంకర్ చెప్పుకోచ్చాడు.

## లావణ్య నాపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు



టాలీవుడ్ యంగ్ హీరో రాజ్‌తరుణ్ పై అతని ప్రేయసి లావణ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం కొన్ని రోజులుగా హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నటి మాల్వీ మల్హోత్రాతో ఎఫైర్ కారణంగా వదిలేసి వెళ్లిపోయాడని నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. తాజాగా ఈ ఘటనపై రాజ్ తరుణ్ స్పందించాడు. రాజ్ తరుణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తిరగబడర సామీ. మాల్వీ మల్హోత్రా కథానాయికగా నటిస్తుంది. ఆగష్టు 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండగా చిత్ర యూనిట్ తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసింది.ఈ సమావేశంలో రాజ్ తరుణ్ – లావణ్య అంశంపై మీడియా అడుగగా.. రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. లావణ్య నాపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రతిదానికి నా దగ్గర ఆధారం ఉంది. నేను ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు. కచ్చితంగా నేను లీగల్‌గానే వెళతాను న్యాయం జరిగే వరకు పోరాడుతా. లావణ్య ఇన్ని రోజులు నాపై ఆరోపణలు చేసింది. కానీ ఒక్కసారి అయిన ఆధారాలు చూపించిందా. లావణ్య చేస్తున్న ఆరోపణలకు సంబధించి ఇప్పటివరకు ఎవరూ ఆధారాలు అడగలేదు. నేను లావణ్యతో గతంలో సహ జీవనంలో ఉన్నది వాస్తవం. లావణ్య అబార్షన్ అంటూ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. ఒకవేళ నిజమే అయితే అందుకు సంబంధించిన మెడికల్ అధారాలు బయటపెట్టాలి కానీ ఎఫ్ఐఆర్ కాపీలో అబార్షన్ గురించి లేదు అంటూ రాజ్ తరుణ్ తెలిపాడు.ఇక మాల్వీ మల్హోత్రా మాట్లాడుతూ.. తనపై ఆరోపణలు చేసిన లావణ్య గురించి గతంలో రాజ్ తరుణ్ తనతో ఎన్నడూ మాట్లాడలేదని చెప్పుకొచ్చింది. నా ఫ్యామిలీ కానీ, నేను కానీ ఆమెని ఎప్పుడూ కలవలేదు. మాపై ఇలాంటి ఆరోపణలు ఎందుకు చేస్తుందో తెలియదు. ఆమె నాతో పాటు నా బ్రదర్‌పై చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే పోలీసులకు వివరణ ఇచ్చాను. ఈ నెల 24న కూడా లావణ్య నాకు మెసేజ్ చేసింది. అదీ కూడా పోలీసులకు ఫార్వర్డ్ చేశాను. లావణ్య గురించి ఇంతకు మించి ఏమీ మాట్లడలేను. లీగల్‌గా ఆమెపై చర్యలు తీసుకుంటాను అంటూ మాల్వీ చెప్పుకొచ్చింది.



## బాలీవుడ్ రామాయణలో విశ్వంభర విలన్!

బాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ మూవీ రామాయణ. నితేశ్ తివారీ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నిర్మాణంలో టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ కూడా భాగమయ్యారు! ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి చాలా వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ చకర్లు కొడుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో మరో నటుడు భాగం కానున్నట్లు తెలిసింది.అతని పేరే కునాల్ కపూర్. ఈయన రామాయణలో కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. దీని కోసం ఆయనకు స్క్రీన్ టెస్ట్ కూడా చేశారని బాలీవుడ్ మీడియాలో ప్రచారం సాగుతోంది. ఇప్పుడాయన తన పాత్ర కోసం రిహార్సిల్స్ చేస్తున్నారని సమాచారం. అయితే, ఈ పాత్రకు సంబంధించిన వివరాలేమి తెలియలేదు. దీనిని మూవీ టీమ్ గోప్యంగా ఉంచాలని అనుకుంటోందట.మరో విషయం ఏంటంటే కునాల్ కపూర్ తెలుగులో మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతోన్న విశ్వంభరలోనూ నటిస్తున్నారు. ఇందులో ఆయన విల న్ పాత్రలోకనిపించనున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి వశిష్ఠ ద ర్శకత్వం వహిస్తున్నారు. ఇక రామాయణ సినిమా విషయానికొస్తే రెండు భాగాలుగా తీయబోతున్నారట. 2025 డిసెంబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి విడుదల చేయాలనుకుంటున్నారు. షూటింగ్ కోసం పన్నెండు భారీ సెట్లను కూడా సిద్ధం చేశారట. అయోధ్య, మిథిలా నగరాలను తలపించేలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. భారీ బడ్జెట్ , 3డీ ఫార్మాట్‌తో సినిమాను నిర్మిస్తున్నా రు.ఇప్పటికే మూవీ షూటింగ్ ప్రారంభమైపోయింది. చిత్రీకరణకు సంబంధించిన కొన్ని ఫొటోలు కూడా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవిగా నటిస్తున్నారు. రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్నట్లు సమాచారం అందుతోంది. మొత్తంగా ఈ సినిమాకు సంబంధించి అప్డేట్స్ కోసం దేశవ్యాప్తంగా సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## గేమ్ ఛేంజర్‌లో జాబిలమ్మ లుక్ ట్రెండింగ్


ఇండియన్ సినిమా రంగంలో ప్రతిభతోపాటు అందంతో ఆకట్టుకొంటున్న హీరోయిన్లలో కియారా అద్వానీ ఒకరంటే ఎలాంటి సందేహం అక్కర్లేదు. గ్లామర్, ఫెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకొంటూ ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం ఆమె జన్మదినం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె తాజాగా నటించిన గేమ్ ఛేంజర్ సినిమాలోని లుక్‌ను అభిమానులకు పరిచయం చేశారు. అయితే కియారా అద్వానీ నటించిన తాజా చిత్రం గేమ్ ఛేంజర్ చిత్రంలో ఆమె జాబిలమ్మగా కనిపించబోతున్నారు. ఈ సినిమాలోని అందాలు విరజిమ్ముతున్న లుక్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేశారు. రాంచరణ్‌తో కలిసి నటించిన జరగండి సాంగ్‌లోని బ్యూటీఫుల్ లుక్‌ను రిలీజ్ చేశారు. హ్యాపీ బర్త్ డే కియారా అంటూ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు అందించారు. జాబిలమ్మగా కియారా అద్వానీ తన వైబ్రెంట్ ఎనర్జీతో మీ హృదయాలను దోచుకోవడం ఖాయం అంటూ నిర్మాతలు, చిత్ర యూనిట్ ఆమెపై ప్రశంసల వర్షం కురిపించారు.కియారా అద్వానీ కెరీర్ విషయానికి వస్తే.. ఇటీవల జుగ్ జుగ్ జీయో, గోవిందా నామ్ మేరా, సత్యప్రేమ్ కి కథ సినిమాల్లో నటించారు. ఇక ఆమె నటించిన గేమ్ ఛేంజర్ మూవీ రిలీజ్‌కు సిద్దంగా ఉంది. వార్ 2 చిత్రంలో కూడా హీరోయిన్‌గా నటిస్తున్నారు.గేమ్ ఛేంజర్ సినిమా విషయానికి వస్తే.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఇక ఈ సినిమా డిసెంబర్‌లో రిలీజ్ కానున్నది. చాలాకాలంగా ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్, ఇండియన్ ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## 'హుషారు' హీరో కొత్త సినిమా.. 'ఉరుకు పటేలా' టీజర్ విడుదల

'హుషారు' సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు టాలీవుడ్ యువ కథానాయకుడు తేజాస్ కంచర్ల. ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. గెట్ ఉరికిఫైడ్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాకు వివేక్‌రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా.. కంచర్ల బాలభాను నిర్మిస్తున్నాడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఇక ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్‌ను వదిలింది.'హుషారు' సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు టాలీవుడ్ యువ కథానాయకుడు తేజాస్ కంచర్ల. ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. గెట్ ఉరికిఫైడ్ అనేది ఉప శీర్షిక. ఈ సినిమాకు వివేక్‌రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా.. కంచర్ల బాలభాను నిర్మిస్తున్నాడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఇక ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్‌ను వదిలింది.

## విటమిన్ ఢీ ముఖ్యమే.. ఎక్కువైతే కష్టమే

### శరీరంలో విటమిన్ డీ ఎక్కువైతే ఎన్నో అనారోగ్య సమస్యలు



**విశ్వంభర (హెల్త్):** శరీరానికి విటమిన్ డీ ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. శరీరానికి సరిపడ విటమిన్ డీ లభించకపోతే ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిసిందే. అయితే ప్రస్తుతం అపార్ట్‌మెంట్ కల్చర్ పెరగడం, ఆఫీసుల్లో ఏసీ గదుల్లో గంటలతరబడి పని చేస్తుండడం వల్ల విటమిన్ డీ లోపం బారిన పడుతోన్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో చాలా మంది విటమిన్ డీ సప్లిమెంటరీలను తీసుకుంటున్నారు. దీంతో శరీరంలో విటమిన్ డీ ఎక్కువయ్యే అవకాశాలు కూడా ఉంటున్నాయి. ఇంతకీ విటమిన్ డీ ఎక్కువైతే ఎలాంటి నష్టాలు ఉంటాయి.? ఇంతకీ విటమిన్ డీ ఎక్కువైతే కనిపించే లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**20 నుంచి 40నానో గ్రాములుండాలి..**

సాధారణంగా శరీరంలో మిల్లీలీటర్‌కు 20 నుంచి 40 నానోగ్రాములు (ng/mL)గా ఉండాలి. విటమిన్ డీ ఈ స్థాయిలో ఉంటే శరీరం సక్రమంగా పనిచేస్తుంది. ఈ స్థాయి తగ్గితే శరీరంలో బలహీనత, ఎముకల నొప్పి వంటి సమస్యలు వస్తాయి. అలాగే కొందరిలో విటమిన్ డీ తక్కువైతే చర్మ సంబంధిత సమస్యలు కూడా వస్తాయని నిపుణులు చెబుతుంటారు. అందుకే ఉదయం కచ్చితంగా కాసేపైనా సూర్య రశ్మి తగిలేలా చూసుకోవాలి.

**విటమిన్ డీ ఎక్కువైతే అనేక సమస్యలు..**

ఇదిలా ఉంటే విటమిన్ డీ ఎక్కువైతే కొన్ని రకాల సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఎముకల్లో నొప్పి, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. నడవడంలో కూడా ఇబ్బందిగా ఉంటుంది. చిన్న చిన్న పనులకే త్వరగా అలసిపోతుంటారు. ఆకలి తగ్గుతుంది. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ఇది మూత్రపిండాల పనితీరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇతర కిడ్నీ సంబంధిత సమస్యలకు కూడా దారితీయవచ్చు. ఉన్నపలంగా బరువు తగ్గుతున్నా విటమిన్ డీ ఎక్కువైనట్లు అర్థం చేసుకోవాలి. విటమిన్ డీ ఎక్కువైతే కడుపు సంబంధిత సమస్యలు కూడా తలెత్తే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయి. ఇక విటమిన్ డి అధికంగా ఉండడం వల్ల గుండె కొట్టుకోవడం క్రమరహితంగా ఉంటుంది. అలాగే.. గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. సాధారణంగా శరీరంలో మిల్లీలీటర్‌కు 20 నుంచి 40 నానోగ్రాములు (ng/mL)గా ఉండాలి. విటమిన్ డీ ఈ స్థాయిలో ఉంటే శరీరం సక్రమంగా పనిచేస్తుంది. ఈ స్థాయి తగ్గితే శరీరంలో బలహీనత, ఎముకల నొప్పి వంటి సమస్యలు వస్తాయి. అలాగే కొందరిలో విటమిన్ డీ తక్కువైతే చర్మ సంబంధిత సమస్యలు కూడా వస్తాయని నిపుణులు చెబుతుంటారు. అందుకే ఉదయం కచ్చితంగా కాసేపైనా సూర్య రశ్మి తగిలేలా చూసుకోవాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

శరీరంలో విటమిన్ డి ఎక్కువైతే విటమిన్ డీ సప్లిమెంట్లను తీసుకోకూడదు. వైద్యుల సూచనలు లేకుండా సప్లిమెంటరీ ట్యాబ్లెట్స్ తీసుకోకూడదు. అలాగే విటమిన్ డీ ఎక్కువగా లభించే చేపలు (సాల్మన్, ట్యూనా), గుడ్డు, తృణధాన్యాలకు దూరంగా ఉండాలి. సూర్య రశ్మిలో గడిపే సమయాన్ని తగ్గించాలి.

## తెలుగులో అందుబాటులోకి గూగుల్ జెమిని




**విశ్వంభర (సాంకేతికం):** ఇండియాలో గూగుల్ జెమిని యాప్ అందుబాటులోకి వచ్చింది. గూగుల్ తన జెనరేటివ్ ఏఐ చాట్‌బాట్ జెమిని మొబైల్ యాప్‌ను ఇంగ్లీష్ తో పాటు తొమ్మిది భారతీయ భాషలలో ప్రారంభించింది. "గూగుల్ అత్యంత సామర్థ్యమున్న ఏఐ మోడళ్లకు వినియోగదారులకు యాక్సెస్‌ను అందించే జెమినీ యాప్, జెమినీ అడ్వాన్స్‌డ్ రెండూ ఇప్పుడు తొమ్మిది భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటాయి. ఎక్కువ మంది వ్యక్తులు తమ ప్రాధాన్య భాషలో సమాచారాన్ని యాక్సెస్ చేయడంలో, పనులను పూర్తి చేయడంలో సహాయపడతాయి" అని కంపెనీ ఒక బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. గూగుల్ తొమ్మిది స్థానిక భాషలను కూడా జెమిని అడ్వాన్స్‌డ్‌లో అనుసంధానిస్తుంది. అంతేకాకుండా గూగుల్ జెమిని అడ్వాన్స్‌డ్‌లో కొత్త ఫీచర్‌లను ప్రవేశపెట్టింది. ఇందులో కొత్త డేటా విశ్లేషణ సామర్థ్యాలు, ఫైల్ అప్‌లోడ్‌లు, ఆంగ్లంలో గూగుల్ల సందేశాలలో జెమినితో చాట్ చేసే సామర్థ్యం ఉన్నాయి. భారత్‌తో పాటు టర్కీ, బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక దేశాల్లో కూడా జెమినీ యాప్‌ను విడుదల చేశారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో లాంచ్‌ను ప్రకటించారు. "యాప్ మీకు అవసరమైన సహాయం పొందడానికి టైప్ చేయడానికి, మాట్లాడడానికి లేదా చిత్రాన్ని జోడించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఫ్లాట్ టైర్‌ని ఎలా మార్చాలో సూచనల కోసం దాని చిత్రాన్ని తీయండి లేదా ఖచ్చితమైన కృతజ్ఞతా పత్రాన్ని వ్రాయడంలో సహాయం పొందండి" అని పేర్కొన్నారు. తెలుగుతో పాటు హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, తమిళం, ఉర్దూ భాషల్లోనూ ఈ యాప్ సేవలందిస్తుందని గూగుల్ పేర్కొంది. అంటే మీకు నచ్చిన భాషలో జెమినీని వాడొచ్చు. వాయిస్ అసిస్టెంట్‌ను ఉపయోగించొచ్చి ఏదైనా సెర్చ్ చేయవచ్చు.

తెలుగు దినపత్రిక
రిపోర్టర్స్ కావలెను V3 NEWS విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com